# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 167 | హైదరాబాద్ | సోమవారం 22-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

టీడీపీ జోనల్ కో ఆర్డినేటర్లతో
నారా లోకేశ్ కీలక సమావేశం


11లో

## నారా లోకేశ్ స్పోర్ట్స్ గ్రౌండ్ లో ఎంపీఎల్ 4 పోటీలు.. ప్రారంభించిన బ్రహ్మణి

- నాలుగో సీజన్ లోకి అడుగుపెట్టిన మంగళగిరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు
- ప్రారంభోత్సవానికి విచ్చేసిన నారా బ్రహ్మణి
- కాసేపు బ్యాటింగ్ చేసిన బ్రహ్మణి

## రెండేళ్లు ఆగాం... ఇక ఆగేది లేదు: కేసీఆర్

- సుదీర్ఘకాలం తర్వాత కేసీఆర్ ప్రెస్ మీట్
- ఇక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరిక
- భూములు అమ్మడం తప్ప ఈ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని విమర్శలు


11లో

## నేటి భారతం

- అవసరమైతేనే మాట్లాడు.. లేదంటే నిశ్శబ్దంగా వుండు..
- సాధ్యమైనంతవరకు మీ సంభాషణల్లో
- ఇతరుల ప్రస్తావన తీసుకుని రాకుంటేనే మంచిది..
- ఒక్కటి గుర్తుపెట్టుకోండి..
- ఉత్తమమైన సంభాషణలు ఒక సిద్దాతం చుట్టూ తిరుగుతాయి..
- అలాగే నీచమైన సంభాషణలు వ్యక్తుల చుట్టూ తిరుగుతాయి..
- అందుకే అంటారు పెద్దలు..
- నాలుకను అదుపులో పెట్టుకుంటే..
- మీ ఆరోగ్యం బావుంటుంది..
- అలాగ మీ జీవితం కూడా బావుంటుంది..
- ఒకటి అతిగా తినడం.. రెండు అతిగా వాగడం..
- ఈ రెండూ కంట్రోల్ లో ఉండాలంటే..
- మీ నాలుక అదుపులో ఉండాలి..

-కేసారం పెంటారెడ్డి,
సీనియర్ సామాజిక విశ్లేషకులు..



11లో

విశాఖ గడ్డపై మెరిసిన

## భారత అమ్మాయిలు..

- తొలి టీ20లో లంకపై టీమిండియా గెలుపు
- 8 వికెట్ల తేడాతో లంక చిత్తు
- అర్ధ సెంచరీతో అదరగొట్టిన జెమీమా రోడ్రిగ్స్
- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో టీమిండియా

## సరళమైన చట్టాలు, నమ్మకంతో కూడిన పాలనతోనే దేశాభివృద్ధి

- సరళమైన చట్టాలతోనే దేశాభివృద్ధి సాధ్యమన్న నిర్మలా సీతారామన్
- కర్ణాటకలోని హంపిలో ఆర్థిక శాఖ 'చింతన్ శిబిర్'
- నమ్మకంపై ఆధారపడిన పాలనా వ్యవస్థకు ప్రాధాన్యం
- పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై చర్చ
- వికసిత భారత్ లక్ష్య సాధనకు సంస్కరణలు అవసరం


11లో


11లో

## రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోం'..

- శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 'ఎట్ హోం'
- సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో తేనీటి విందు
- పలువురు రాజకీయ, పౌర ప్రముఖులకు రాష్ట్రపతి ఆతిథ్యం

## పవన్ కల్యాణ్ సిఫారసుతో రూ.35 కోట్లు కేటాయించడం హర్షణీయం


11లో

- కొండగట్టు అంజన్న క్షేత్రంలో 96 గదుల సత్రం నిర్మాణం
- పవన్ సిఫారసుతో నిధులు కేటాయించిన టీటీడీ
- దీని వల్ల భక్తులకు ఎంతో మేలు జరుగుతుందన్న బండి సంజయ్


## తెలంగాణ రాష్ట్ర పరువు.. చెడగొడుతున్న రెవెన్యూ శాఖ..


12లో

- రాష్ట్రవ్యాప్తంగా రాజ్యమేలుతున్న అంతులేని అవినీతి..
- ప్రజల దోపిడీ అనంతం.. ప్రభుత్వం చర్యలు శూన్యం..
- చేయి తడపనిదే ఏ ఫైలూ ముందుకు కదలని దైన్యం..
- అత్యంత కీలకమైన శాఖలో కీచక పర్వాలు నాట్యం చేస్తున్నాయి..
- అధికారుల అత్యాశ.. అమాయకుల ఆశలను చిదిమేస్తున్నాయి..
- రైతులకు తప్పని తిప్పలు.. పెరిగిపోతున్న అప్పులు..
- ఏ భూమి ఎక్కడుందో తెలియని పరిస్థితి.. యజమానులు బ్రతుకులు అధోగతి..
- ధరణి అని ఒకడు.. భూభారతి అని ఇంకొకడు ముంచడానికి సిద్ధం..
- రెవెన్యూ శాఖ ప్రక్షాళన జరగాలని ఆశిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..

# ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని సర్పంచ్ లు తీర్మానం చేయాలి

* **మాజీ రాజ్యసభ సభ్యులు విహెచ్**
* **గాంధీ విగ్రహం వద్ద జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన**



కరీంనగర్, డిసెంబర్ 21(భారతశక్తి ప్రతినిధి): జాతీయ ఉపాధి హామీ చట్టం పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించి కొత్త పథకాన్ని తెస్తూ బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిరసిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు ఆదివారం నగరంలోని గాంధీ రోడ్ లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జిల్లా, నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు మాట్లాడుతూ నాడు ఈ దేశానికి నాయకత్వం వహించి స్వాతంత్రం తీసుకు వచ్చిన మహాత్మా గాంధీ, నరేంద్ర మోడీ అధికారంలోకి రాగానే జవహర్లాల్ నెహ్రూ, గాంధీ కుటుంబం పై కుట్ర చేస్తున్నారనీ ఆరోపించారు. దేశంలో పరిశ్రమలు స్థాపించడంతోపాటు వ్యవసాయాన్ని ప్రోత్సహించి ప్రపంచ దేశాలకు ఈ దేశాన్ని పరిచయం చేసిన గొప్ప నేతగా నెహ్రూ చరిత్రలో నిలిచిపోయారు, హిందూ ముస్లిం సిక్ లాంటి అన్ని మతాలవారు ఈ దేశంలో ఉన్నారు అందరూ కలిసి ఐక్యమత్యంగా ఉండాలనేది నాటి నేతల ఉద్దేశం, భారతదేశ సంస్కృతిలో అన్ని కులాలు అన్ని మతాల వారిని సమానత్వంతో చూడాలని ఒక చట్టం తీసుకువచ్చే కార్యక్రమంలో భాగంగా నాడు బాబాసాహెబ్ అంబేద్కర్ గారు రాజ్యాంగం రూపంలో ఒక ఆలోచన చేసినారు, బిజెపి పార్టీలో స్వాతంత్రంలో ఎంతమంది పాల్గొన్నారో నరేంద్ర మోడీ చెప్పాలి, స్వతంత్ర ఉద్యమం నుండి పిరికిపందలా బయటకు వచ్చిన వీరసావర్కర్ బిజెపికి దేవుడయ్యాడు, నాడు ఇంతటి మీడియా పరిజ్ఞానం లేకపోయినా మహాత్మా గాంధీ ఆలోచనలను దేశ ప్రజలు గౌరవించారు, అంబేద్కర్ను పార్లమెంటు సాక్షిగా అవమానించిన చరిత్ర అమిత్ షాది, అంబేద్కర్ కూడా ఎంతోమంది చేత దేశంలో దేవునిలా గౌరవించబడుతున్నారు, గాంధీ పేరును తొలగించాలనే కుట్రలో భాగంగానే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును బిజెపి కేంద్ర ప్రభుత్వం తొలగించింది, ఆనాడు యుపీఏ ప్రభుత్వంలో దేశంలో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారనే విషయాన్ని గమనించిన సోనియా గాంధీ ఈ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టి ఎంతో మందికి ఉపాధి కల్పించడంతోపాటు కడుపునిండా అన్నం పెట్టింది, ఈ పథకం ద్వారా గ్రామీణ స్థాయిలో చెరువులు, కుంటలకు పూడికలు తీయడంతో పాటు నీటి విలువ సామర్థ్యం పెంచడం తద్వారా వ్యవసాయం రంగానికి ప్రయోజనకరంగా మారి పండిన పంటల ద్వారా ప్రతి బిడ్డ కడుపునిండా అన్నం తిన్నారు వ్యవసాయ ఆధారిత రంగాలు అభివృద్ధి చెందినాయి, బిజెపి ఈ చట్టంలో చేసిన మార్పుల ద్వారా రాష్ట్రాలపై ఆర్థిక భారం పడనుంది, భవిష్యత్తులో మహాత్మా గాంధీ పేరును పూర్తిగా తొలగించి కొత్త పార్లమెంటుకు వీరసావర్కర్ పేరు లేదా నరేంద్ర మోడీ పేరును పెట్టే ప్రయత్నాలు బిజెపి చేస్తుంది, ఈ దేశానికి స్వతంత్రం తీసుకు వచ్చిన మహాత్మా గాంధీని బిజెపి అవమానిస్తుంది, దేశ స్వాతంత్రంలో బిజెపి ఆర్ఎస్ఎస్ ఎక్కడైనా కనిపించాయా, కోట్ల రూపాయలు ఆస్తులు ఈ దేశం కోసం దార పోసి దేశం కోసం ప్రాణాలను అర్పించడానికి గాంధీ కుటుంబం ఎంతో చేసింది, వీరసావర్కర్ పేరు లేదా నరేంద్ర మోడీ పేరును పెట్టే ప్రయత్నాలు బిజెపి చేస్తుంది, ఈ దేశానికి స్వతంత్రం తీసుకు వచ్చిన మహాత్మా గాంధీని బిజెపి అవమానిస్తుందనీ ఆరోపించారు. డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ యూపీఏ చైర్ పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ జాతీయ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును పెట్టడం జరిగిందని, సత్యం అహింస ద్వారా ఈ దేశానికి స్వాతంత్రం సాధించి పెట్టిన మహాత్మా గాంధీ చూపించిన మార్గాన్ని ప్రపంచంలోని అనేక దేశాలలో ఒబామా, నెల్సన్ మండేల లాంటి వాళ్ళు మహాత్మా గాంధీ స్ఫూర్తితో చూపిన మార్గాన్ని ఎంచుకొని ఆ దేశాలకు స్వతంత్రాన్ని తీసుకువచ్చిన చరిత్ర ఉంది, బ్రిటిష్ పాలకులను తరిమికొట్టి స్వాతంత్రాన్ని తెచ్చిన గొప్ప వ్యక్తి మహాత్మా గాంధీ, నాడు స్వతంత్ర ఉద్యమంతో పాటు అంటరానితనాన్ని రూపుమాపి, మహిళల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి మాత్మ గాంధీ, వారిని నేడు ప్రపంచంలో ఎన్నో దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగర అధ్యక్షుకు వైద్యుల అంజన్ కుమార్, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ గౌడ్, ఆరెపల్లి మోహన్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి, ఉప్పుల అంజన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఎల్‌పిఎల్ ఆధ్వర్యంలో
# విద్యార్థులకు పబ్లిక్ స్పీకింగ్

కరీంనగర్, డిసెంబర్ 21(భారస్తశక్తి ప్రతినిధి): విద్యార్థుల్లో ప్రజాభాషణ పబ్లిక్ స్పీకింగ్ నైపుణ్యాలను పెంపొందించాలనే ఉద్దేశంతో శ్రద్ధ లార్న్కోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం స్టూడెంట్ అంబాసడర్ ప్రోగ్రామ్ ను జగిత్యాల పట్టణంలోని ఈషా స్కూల్ ఆఫ్ నాలెడ్జ్, గౌతమ హైస్కూల్లో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు భాషలు అలాగే గణితం, సైన్స్, సోషల్ వంటి ప్రధాన కోర్ సబ్జెక్టుల నుంచి అంశాలు, టాపిక్స్‌పై విద్యార్థులు కెమెరా ముందు ప్రేక్షకుల సమక్షంలో స్వేచ్ఛగా మాట్లాడేలా ప్రోత్సహించారు. ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, స్పష్టమైన భావవ్యక్తీకరణ, వేదికపై మాట్లాడే నైపుణ్యాలు గణనీయంగా మెరుగుపడ్డాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు చేసిన ప్రసంగాల వీడియోలను వరల్డ్ ఆఫ్ విస్డం మొబైల్ అప్లికేషన్లో,అలాగే ఎస్ఎల్‌పిఎల్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో పొందుపరచనున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ వీడియోలు ఇతర విద్యార్థులకు కూడా నేర్చుకునే వేదికగా ఉపయోగపడతాయని సంస్థ నిర్వాహకులు అన్నారు. ఎస్ఎల్‌పిఎల్ మేనేజ్‌మెంట్ టీమ్‌లోని డైరెక్టర్లు ప్రత్యూష ప్రబల , రమేష్ మామిడాల లు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించడానికి చేపట్టిన ఈ ప్రోగ్రాంకు పాఠశాలల ఉపాధ్యాయులు ఎంతో సహకారం అందించారని, అలాగే విద్యార్థులు అసాధారణ ప్రతిభను ప్రదర్శించారన్నారు. పాఠశాల మేనేజ్‌మెంట్ ప్రతినిధి రంజిత్ కుమార్ మాట్లాడుతూ, ఇటువంటి ప్రజాభాషణ కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు.భవిష్యత్తులో విద్యార్థులను ధైర్యంగా తమ ఆలోచనలను వ్యక్తపరచగల వక్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమాలను ఎస్ఎల్‌పిఎల్ కొనసాగించనుందని తెలియజేశారు.

## మీ కోసం కాల్ సెంటర్
# 1100 సేవలను వినియోగించుకోండి

* **నేడు సభాభవన్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (PGRS) నిర్వహణ**
* **ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి ఉ.10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్**
* **ఫోన్ చేయవలసిన ల్యాండ్ లైన్ నెం.08562-244437***
* **డీఆర్వో విశ్వేశ్వర నాయుడు**

వైయస్సార్ కడప,డిసెంబర్ 21 : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించు కోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్ కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్వో కోరారు.

* **సభాభవన్ లో పిజిఆర్ఎస్ నిర్వహణ :**

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను ఈ సోమవారం సభాభవన్ లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam. ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చును. “ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (PGRS)” అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు

* **డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం:**

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562 244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి హామీ పథకం పేరుమార్పుపై
# మోదీ ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరసన




హైదరాబాద్, డిసెంబర్ 21(భారత శక్తి): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజనగా మార్చాలని తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తు ఎఐసిసి మరియు టీపీసీసీ ఆదేశాల మేరకు మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ గారి ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలో మహాత్మా గాంధీ గారి విగ్రహానికి పూలమాలలు వేసి శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి గారు, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి గారు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ గారు, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్స రెడ్డి భూపతి రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి గారు మాట్లాడుతూ “గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించాలనే మహాత్మా గాంధీ గారి ఆశయంతో ప్రారంభించిన ఉపాధి హామీ పథకానికి పేరు మార్చడం బీజేపీ ప్రభుత్వ రాజకీయ సంకుచితత్వానికి నిదర్శనం. పేరుమార్పుపై కాకుండా కూలీలకు కనీస వేతనాలు పెంచడం, పని దినాలను 100 నుంచి 200కు పెంచడం, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించడం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి” అని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ గారి పేరును పథకం నుంచి తొలగించడం దేశ చరిత్రను మార్చే ప్రయత్నంగా కాంగ్రెస్ పార్టీ భావిస్తోందని, ఇటువంటి నిర్ణయాలను ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహ యాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రావణ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మా రెడ్డి, గడ్డం రాజేందర్ రెడ్డి, జక్కుల మల్లేష్ యాదవ్, సిద్ధనోల్ల సంజీవ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, చిట్ల దివాకర్, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, కవలి గణేష్, డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్, పండరి రావు, సోమన్న గారి శ్రీధర్ రెడ్డి, పేరిక శివ, గణేష్, ఎండి జకీర్, ఎండి లయక్, సంతోష్ ముదిరాజ్, NMC అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, ఆకుల హరి కిరణ్ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, మహిళా నాయకులు, INTUC నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గీతంను సందర్శించిన
# ట్రిపుల్ ఐడీ హైదరాబాద్ మేనేజింగ్ కమిటీ




సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 21: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ (ఐఐఐడీ), హైదరాబాదు ప్రాంతీయ చాప్టర్ యొక్క మేనేజింగ్ కమిటీ సభ్యులు అధికారక సందర్శనలో భాగంగా, హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ను ఇటీవల సందర్శించారు. సందర్శనలో భాగంగా, ఆర్కిటెక్చర్ స్కూల్ విద్యా వ్యవస్థ, అక్కడి స్థితిగతులు, కీలకమైన మౌలిక సదుపాయాలను కమిటీ సమీక్షించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టూడెంట్స్ వర్క్ ఎగ్జిబిషన్ ప్రధాన ఆకర్షణగా నిలవగా, కమిటీ సభ్యులు అక్కడున్న విద్యార్థులతో నేరుగా సంభాషించారు. ఆవిష్కరణ, డిజైన్ సున్నితత్వం, విద్యాపరమైన కఠోరతను ప్రతిబింబించే విద్యా ప్రాజెక్టుల ప్రత్యేక ప్రదర్శనను కూడా కమిటీ సభ్యులు వీక్షించారు. ట్రిపుల్ ఐడీ ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ ఆర్. బందన్ కుమార్ మిశ్రా ప్రసంగించారు. ఆర్కిటెక్చర్ విద్యలో రాణించడానికి సంస్థ యొక్క నిబద్ధతనుపునరుద్ఘాటించడంతో పాటు ట్రిపుల్ ఐడీ హైదరాబాదు చాప్టర్ సహకారం యొక్క ప్రాముఖ్యతను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. అర్థవంతమైన విద్య, వృత్తిపరమైన సహకారాల ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్శనను అసిస్టెంట్ ప్రొఫెసర్ స్నిగ్ధ రాయ్ సమన్వయం చేశారు.

# మేడారం తల్లులను దర్శించుకున్న శెట్టి కుటుంబం



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, డిసెంబర్ 21: తెలంగాణ రాష్ట్రం లోని అతి పెద్ద జాతర మన మేడారం జాతర ఆదివాసీ ప్రాంతం ములుగు జిల్లాలో అతి పెద్ద గిరిజన పండుగ అయిన వనదేవతలు సమ్మక్క తల్లి సారలమ్మలను దర్శించుకున్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు మరియు అతని కుటుంబ సభ్యులు. తల్లుల గద్దెల దగ్గరకు వెళ్లి దర్శించుకున్న తరువాత మొక్కులు వున్నవారు వారంతా బంగారాన్ని తూకం వేసి సమర్పించుకుంటారు. ఇది అక్కడ తరతరాలుగా నడుస్తున్న ఆనవాయితీ. దానిలో భాగంగా శెట్టి దంపతులు వెళ్లి తల్లులను దర్శించుకోవడం జరిగింది. అదే సమయంలో ఇల్లందు నియోజకవర్గం మాజీ ఎమ్ఎల్ఎ గుమ్మడి నర్సయ్య ను శెట్టి కలిశారు. గుమ్మడి నర్సయ్య ప్రజల మనిషి తనకంటూ ఇల్లు కూడా లేని నిస్వార్ధ జీవి. ఐదు పర్యాయాలు గెలిచిన తన జీవిత ప్రయాణము బస్సు లోనే కొనసాగుతుందనీ శెట్టి ఆయనను కొనియాడారు. గుమ్మడి నర్సయ్య బయోపిక్ సినిమాగా తీసే తరుణంలో ఆయనే స్వయంగా కలవడం అదృష్టంగా వుంది అని శెట్టి రంగారావు అన్నారు.

# కలమల్ల తొలి తెలుగు శిలాశాసనానికి ప్రపంచ ప్రాచుర్యం తీసుకువస్తాం..!

* **స్వర్ణ భారతి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీప వెంకట్**

కడప, డిసెంబర్ 21(భారత శక్తి) : కలమల్ల లోని తొలి తెలుగు శిలాశాసనంను ప్రపంచ ప్రాచుర్యం లోకి తీసుకువచ్చేలా కృషి చేస్తామని, భాషా, సాహిత్య సంపదను భావితరాలకు వారసత్వ సంపదగా అందించే బాధ్యత అందరిపై ఉందని.. భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తనయ, స్వర్ణ భారతి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీప వెంకట్ పేర్కొన్నారు. ఆదివారం కడప సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కేంద్ర గ్రంథాలయంలో జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో భారత 13వ ఉపరాష్ట్రపతి గౌ. శ్రీ. ముప్పవరపు వెంకయ్య నాయుడు గారి మానసపుత్రిక "స్వర్ణభారత్ ట్రస్ట్" సౌజన్యముతో.. కీ.శే. డా. జానమద్ది హనుమచ్ఛాస్త్రి "బ్రౌన్ శాస్త్రి" గారి శతజయంతి (19252025) సంవత్సర సందర్భంగా ఏర్పాటు చేసిన తొలి "తెలుగు శిలా శాసనం" నమూనా (రెప్లిక) స్థూపాన్ని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ గౌ.శ్రీమతి ఇమ్మణ్ణి దీపా వెంకట్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం అక్కడి బ్రౌన్ శాస్త్రి శీతల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గౌ.శ్రీమతి ఇమ్మణ్ణి దీపా వెంకట్ తో పాటు.. శ్రీ మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షులు గౌ శ్రీ పి. త్రివిక్రమరావు (విక్రమ్ పూల), సభా అధ్యక్షులుగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి గౌ|| ఆచార్య బి. రాజశేఖర్, అధ్యాపకులు, ప్రముఖ రచయిత, చిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్, కలమల్ల ఎరికల్ ముత్తురాజు ధనుంజయుడు వర్మ వంశీకులు పివిఎల్ఎన్ రాజు, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు డా. జి. పార్వతి హాజరయ్యారు. ** కార్యక్రమంలో దీపా



వెంకట్ మాట్లాడుతూ.. తెలుగు బాషా సాహితీ సౌరభంలో మణి దీపంలా వెలుగొందుతున్న సి.పి. బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రాన్ని సందర్శించడం తనకు చాలా సంతృప్తినిచ్చిందన్నారు. తన తండ్రిగారి జిల్లా పర్యటన అనంతరం కలమల్ల తెలుగు శాసనంను ప్రపంచానికి చాటి చెప్పే అవకాశం కల్పించినందుకు గర్వంగా ఉందన్నారు. శిలాశాసన నమూనాను తమ ట్రస్టు ద్వారా సిపి బ్రౌన్ గ్రంథాలయంలో నెలకొల్పడం అదృష్టంగా భవిస్తున్నామన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న.. సి.పి. బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రం విస్తరణాభివృద్ధికి, యూనివర్సిటీ భాషా పరిశోధక యంత్రాంగం చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. తెలుగు భాషను, సాహిత్యం పట్ల అవపోసనం చేసుకునే స్పూర్తిని ఇచ్చింది.. తన తండ్రి వెంకయ్య నాయుడే అన్నారు. రాజకీయ విధుల్లో భాగంగా అయిన వెంట నడిచిన ప్రయాణము, ఆయనకు అందించిన సహకరమే.. తన బాషా, సాహిత్య సేవ చేసే అవకాశము కలిగిందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయం, మాతృ బాషను గౌరవించడం వంటి తనా తండ్రి సుగుణాలు ఎంతో స్పూర్తినిచ్చాయన్నారు. స్వర్ణ భారతి ట్రస్ట్ ద్వారా గత నాలుగేళ్లుగా తెలుగు భాష విశిష్ట అధ్యయన కేంద్రాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. స్వర్ణ భారతి ట్రస్ట్ ద్వారా ఇప్పటివరకు రెండున్నర లక్ష ఉచిత విద్య సదుపాయాలు, అంతే కాకుండా 6 లక్షల మందికి పైగా ఉచిత వైద్య సదుపాయం కల్పించడం జరుగుతుందంటే సమాజమాలో ఇంకా సేవాభావం, ఆదరణ పరిణాళిస్తుందని గుర్తు చేశారు. జీర్నోవర్ధరణ స్థితిలో ఉన్న కలమల తెలుగు శిలాశాసనం అభివృద్ధికి స్వర్ణ భారతి ట్రస్ట్ ద్వారా ప్రాచుర్యం లోకి తీసుకునే అవకాశాన్ని కల్పించిన చానమతి సాహితీ పీఠం వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. బ్రౌన్ గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ... సామాజిక సేవకు మారుపేరు అయిన దీపా వెంకట్ గారు.. భారత 13వ ఉపరాష్ట్రపతి గౌ. శ్రీ. ముప్పవరపు వెంకయ్య నాయుడు గారి తనయ అన్న గుర్తింపు మాత్రమే కాక ఆయన మానసపుత్రిక "స్వర్ణభారత్ ట్రస్ట్" మేనేజింగ్ ట్రస్టీగా సామాజిక సేవలో ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందరన్నారు. ఎంఏ ఆర్థిక శాస్త్రంలో గోల్డ్ మెడల్ సాధించిన ఆమె స్వర్ణభారతి ట్రస్ట్ ద్వారా.. లక్షలాది మందికి విద్యా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. దేశ విదేశ స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకున్న ఆమే.. మదర్ మదర్ థెరిస్సాకు మరో రూపంగా చెప్పవచ్చన్నారు. సామాజిక, గ్రామీణాభివృద్ధిలో ఎలాంటి రాజకీయ రంగులు లేకుండా నిరాడంబర సేవానిరతితో ముందడుగులేస్తున్న ఆమె ఆశయం స్వర్ణ భారతికి హారతులు అందిస్తోందన్నారు. అధికార భాషా సంఘం అధ్యక్షులు త్రివిక్రమ్ పూల మాట్లాడుతూ.. తెలుగు భాషా ఔన్నత్యాన్ని, తెలుగు శిలా శాసనాన్ని ప్రాచుర్యంలోకి తీసుకువచ్చే సత్కార్యంలో భాగస్వాములైన స్వర్ణభారతి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ దీపా వెంకట్ గారి సేవలు అమూల్యమైనవన్నారు. అనంతరం.. ఆదరణ, ఔన్నత్యాన్ని కోల్పోయే స్థితిలో ఉన్న తెలుగు భాష సాహిత్యాన్ని.. పునర్లిఖించిన ఆంగ్లేయ సాహితీ శిఖరం.. "చార్లెస్ ఫిలిప్ బ్రౌన్" అని ఆయన సేవలు తెలుగు భాషా సాహితీవేత్తలకు ఆదర్శనీయం అన్నారు. తెలుగు భాష ఔన్నత్యం, తెలుగు భాష తీయదనం, కడప జిల్లా కళా సాహిత్య విశిష్టతను పంచుకున్న స్వర్ణభారతి ట్రస్ట్ వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. ఒక విదేశీయుడు మన రాష్ట్రానికి వచ్చి మాతృ బాషా తెలుగు భాషకు కృషిచేసిన మహోన్నతుడికి శతకోటి అభినందనలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రంలో అధికార భాషను పరిరక్షించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి తనపై ఉంచిన బాధ్యతను 100% అమలయేలా కృషి చేస్తానన్నారు. భవిష్యత్తులో కడప జిల్లాలో వెలసిన మొదటి తెలుగు శిలాశాసన నమూనాను సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఏర్పాటు చేసుకోవడం గొప్ప విషయం అన్నారు. అనేక అంశాలలో కడప జిల్లా విశ్వ విఖ్యాతిగాంచిన విషయం తెలిసిందే.. అయితే.. కలమల్ల తెలుగు శిలాశాసనం యజ్ఞవల్క స్మృతి అన్న రాచరిక చరిత్రక పురాణాల్లో ప్రస్తావితం అయిందన్నారు. కలమల తొలి తెలుగు శాసనం మొట్టమొదటిగా మద్రాసులోని తెలుగు మహాసభల్లో 1914 సంవత్సరంలో వెలుగులోకి తీసుకురావడం జరిగింది. తదనంతరం వారి పరిశోధనల ఆధారంగా పలు రకాల గ్రంధాలను ప్రచురించడం జరిగిందన్నారు. అపురూపమైన శిలాశాసనంను సంరక్షించుకునేందుకు ఒక షెడ్ ను ఏర్పాటు చేయాలని.దీపా వెంకట్ గారిని కోరారు. అలాగే.. కలమల్ల శాసన రక్షణతో పాటు.. కలమల్ల గ్రామాన్ని భాషా పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని, కలమల్ల తెలుగు శిలాశాసనంను ప్రపంచ గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ముందుగా యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న.. సి.పి. బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రంలో.. జానుమద్ది సాహితీపీఠం వారి సౌజన్యంతో ప్రతిష్ఠించిన తెలుగు సూర్యుడు, తెలుగు భాషా సముపార్జకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ గారి విగ్రహాన్ని దీపా వెంకట్ గారు పరిశీలించారు. అనంతరం.. సి.పి. బ్రౌన్ పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఛాయాత్రాలను ఒక్కొక్కటిగా తిలకించారు. అంతేకాకుండా.. గ్రంథాలయంలో నిక్షిప్తం చేసిన అమూల్యమైన, వెలకట్టలేని పురాతన తాళపత్ర గ్రంథ నిధిని, పరిశోధనా గ్రంథాలను, పలు రకాల గ్రంథాలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైవియు రిజిష్ట్రార్ పద్మ, వంటేరు శ్రీనివాసులు, పలువురు ప్రముఖులు యోగి వేమన విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, భాష, సాహితీవేత్తలు, బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హిందూ దేవాలయాలకు రాయితీపై మైక్ సెట్, గొడుగులు, శేష వస్త్రం, రాతి మరియు పంచలోహ విగ్రహాలు

: **టిటిడి**

తిరుపతి జిల్లా ప్రతినిధి, 21డిసెంబర్ (భారత శక్తి) : ప్రపంచ ప్రఖ్యాత హైందవ సంస్థ అయిన తిరుమల తిరుపతి దేవస్థానములు సనాతన హిందూ ధర్మప్రచారంలో భాగంగా హిందువుల ఆలయాలకు మైక్ సెట్, గొడుగులు, శేషవస్త్రం, రాతి మరియు పంచలోహ విగ్రహాలను రాయితీపై అందిస్తుంది. నిబంధనలకు అనుగుణంగా డిడితో పాటు పూర్తి చేసిన దరఖాస్తులను కార్యనిర్వహణాధికారి, టిటిడి పరిపాలనా భవనం, కె.టి.రోడ్డు, తిరుపతి అనే చిరునామాకు పంపాలి. ఇతర వివరాలకు 08772264276 అనే నంబరులో సంప్రదించగలరు.

* **మైక్ సెట్**

మైక్ సెట్ కొనుగోలుకు అయ్యే ఖర్చు రూ.25,000లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన ఎస్ సి, ఎస్ టి లకు 90% రాయితీ మినహాయించి రూ.2,500/ డి.డి. తీసి పంపించాల్సి ఉంటుంది. ఇతరులకు 50% రాయితీ మినహాయించి రూ. 12,500/ చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆలయ కమిటీ దరఖాస్తు పత్రం, సంబంధిత ప్రాంతంలోని తహశీల్దార్ / దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ నుండి సిఫార్సు లేఖ, ఆలయ ఫొటో, ఆలయ కరెంట్ బిల్లు, దరఖాస్తుదారు ఆధార్ కార్డును జత చేయాలి.

* **గొడుగులు**

హిందూ దేవాలయాలకు కేటగిరీలతో సంబంధం లేకుండా అర్హులైన దరఖాస్తుదారులకు రూ.14,500 విలువ చేసే గొడుగులను 50 % రాయితీతో రూ.7,250 లకే టిటిడి అందిస్తుంది. ఇందుకోసం ఆలయ కమిటీ దరఖాస్తు పత్రం, సంబంధిత ప్రాంతంలోని తహశీల్దార్ / దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ తో సదరు శాఖ సిఫార్సు లేఖ, దరఖాస్తుదారు ఆధార్ కార్డ్, ఆలయ ఫొటోను జత చేసి దరఖాస్తు చేయాలి. సదరు పత్రాలతోపాటు రాయితీ మినహాయించి రూ. 7,250/ లకు డి.డిను జత చేసి పంపాలి.

* **శేష వస్త్రం**

హిందూ దేవాలయాలకు ఉచితంగా శేషవస్త్రాన్ని టిటిడి ఉచితంగా అందిస్తోంది. ఇందుకోసం ఆలయ అభ్యర్థన లేఖను కార్యనిర్వాణాధికారి, తిరుపతి పేరుతో దరఖాస్తు చేయాలి. సంబంధిత ప్రాంతంలోని తహశీల్దార్ / అసిస్టెంట్ కమిషనర్, ఎండోమెంట్ డిపార్ట్మెంట్ నుండి సిపార్సు లేఖ, దరఖాస్తు దారు ఆధార్ కార్డు, ఆలయ ఫోటోను జత చేయాలి.

* **రాతి & పంచలోహ విగ్రహాలు**

శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ పద్మావతీ అమ్మవారి రాతి విగ్రహాలను 5 అడుగులు, అంతకంటే తక్కువ ఎత్తులో ఉన్న విగ్రహాలను ఉచితంగా అందిస్తారు. మిగిలిన దేవతా విగ్రహాలకు 75 శాతం సబ్సిడీపై కేవలం 25% ధరను చెల్లిస్తే వివిధ వర్గాల వారికి అందిస్తారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఎస్సీ ఎస్టీ వర్గాల వారికి ఉచితంగా రాతి విగ్రహాలను అందిస్తారు. పంచలోహ విగ్రహాలను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఎస్సీ ఎస్టీ వర్గాల వారికి 90% సబ్సిడీతో, ఇతర వర్గాల వారికి 75% సబ్సిడీతో అందిస్తారు. దేవతా మూర్తుల రాతి మరియు పంచలోహాల విగ్రహాల పేర్లు, కొలతలతో కార్యనిర్వహణాధికారి, టిటిడి వారికి ఆలయ అభ్యర్థన లేఖ పంపించాలి. దరఖాస్తుదారులు ఖచ్చితంగా స్థానిక తహసీల్దార్ / అసిస్టెంట్ కమీషనర్ నుండి సదరు ఎండోమెంట్ శాఖ తాజా సిఫార్సు లేఖ, ఆలయ బ్లూ ప్రింట్ ను ఏ4 సైజ్ లో మరియు అవసరమైన విగ్రహాల డ్రాయింగ్, ఒరిజినల్ ఆలయ ఫోటో, దరఖాస్తుదారు ఆధార్ కార్డును జత చేయాలి. ఎం.ఈ.వో లేదా డీఈవో లతో ఆమోదం పొందిన విద్యా సంస్థలకు సరస్వతీ దేవీ రాతి విగ్రహాన్ని 50% సబ్సిడీతో టిటిడి అందిస్తోంది. మఠాలు, ట్రస్ట్ లకు, ఆశ్రమాలకు వివిధ దేవతామూర్తుల విగ్రహాలను 50% రాయితీతో అందిస్తారు.

# రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా "కిసాన్ గ్రామీణ మేళా"

* **ప్రారంభకులు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ**
* **కిషన్ జాగరణ్ అధ్యక్షులు సుగుణాకర్ రావు**



కరీంనగర్, డిసెంబర్ 21(భారతశక్తి ప్రతినిధి) రైతులు, మహిళా సంఘాలు, గ్రామీణ ప్రజల ఆర్థిక ప్రగతిని కాంక్షిస్తూ, కిసాన్ జాగరణ్ ఆధ్వర్యంలో కరీంనగర్ వేదికగా కిసాన్ గ్రామీణ మేళాను నిర్వహిస్తున్నట్లు కిసాన్ జాగరణ్ అధ్యక్షులు పి. సుగుణాకర్ రావు తెలిపారు. బృహత్తర కార్యక్రమాన్ని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రారంభిస్తారని వెల్లడించారు.

నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 2022, 2023 సంవత్సరాల్లో నిర్వహించిన ప్రదర్శనలకు తెలంగాణలోనే అత్యధిక సంఖ్యలో రైతులు హాజరైన రికార్డు ఉందని, ఈసారి అంతకు మించి వినూత్న మేళాను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ లేదా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రదర్శనలకు దూరప్రాంత రైతులు వెళ్లలేకపోతున్నారని, అందుకే రైతు చెంతకే సాంకేతికతను తీసుకురావాలనే ఉద్దేశంతో కరీంనగర్‌ను వేదికగా ఎంచుకున్నట్లు తెలిపారు.

* **మేళా విశేషాలు**

లాభదాయక ప్రత్యామ్నాయ పంటలు, కేవలం వరి సాగుకే పరిమితం కాకుండా, పామాయిల్, పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం వంటి మార్గాల ద్వారా ఎకరాకు కనీసం లక్ష రూపాయల ఆదాయం ఎలా పొందాలనే అంశంపై రైతులకు దిశానిర్దేశం చేయనున్నారు.

* **నీరు నిలిచే పొలాల్లో మత్స్య సాగు**

ఎస్.ఆర్.ఎస్.పి కెనాల్ పరివాహక ప్రాంతాల్లో నీరు నిలిచిపోయి వరి పంట దెబ్బతింటున్న పొలాల్లో చేపలు రొయ్యల పెంపకం ద్వారా అధిక లాభాలు గడించే విధానాలను వివరిస్తారు.

* **ఎఫ్‌పిఓల బలోపేతం**

చింతకుంట ఎఫ్‌పిఓ శంకరయ్య ఆధ్వర్యంలో రూ. 2 కోట్ల టర్నోవర్, కోనరావుపేట ఎఫ్‌పిఓ పురుషోత్తం రావు తేనెటీగల ప్రాజెక్ట్, బోయినపల్లి ఎఫ్‌పిఓ వేణుగోపాల్ రావు సాధిస్తున్న విజయాలను ఆదర్శంగా తీసుకుని ఇతర రైతులను చైతన్యపరచనున్నారు.

* **నూతన సాంకేతికత**

యూరియా బుకింగ్ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త యాప్ వినియోగం, తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు తెచ్చే తేనెటీగల పెంపకం, గీత కార్మికుల కోసం చెట్లు ఎక్కే ఆధునిక పరికరాలపై అవగాహన కల్పిస్తారు. ఈ మేళాలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అనుభవజ్ఞులైన ప్రగతిశీల రైతులు పాల్గొని తమ అనుభవాలను పంచుకోనున్నారు. రైతులు, మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




# బిఆర్ఎస్ ను విడి కాంగ్రెస్ లో చేరిన సర్పంచులు

* **సాధారంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే కవ్వంపెల్లి**

కరీంనగర్, డిసెంబర్ 21(భారతశక్తి ప్రతినిధి) : వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో తిమ్మాపూర్ మండలం జూగుండ్ల సర్పంచ్ పురం శ్వేత, ఉప సర్పంచ్ దాడి సంపత్, గన్నేరువరం మండలం హన్మాజీపల్లి సర్పంచ్ నందికొండ అంజిరెడ్డి, మానకొండూర్ మండలం వెల్ది సర్పంచ్ పెంచాల కిషన్ రావు, మానకొండూర్ మాజీ సర్పంచ్ రొడ్డ పృథ్వీ, బీఆర్ఎస్ వెల్ది గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి మడ్డి చంద్రయ్య లు పార్టీలో చేరగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి అనేక మంది సర్పంచులు, వార్డు సభ్యులు, ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. కాంగ్రెస్ లో చేరిన వారంతా ప్రభుత్వ పథకాలను పేదలకు చేరువయ్యేలా చూడాలని, అలాగే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా త్వరలో జరుగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్, గన్నేరువరం మండలాల పార్టీ అధ్యక్షులు నందగిరి రవీంద్రచారి, ముస్కు ఉపేందర్ రెడ్డి, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, శ్రీగిరి రంగారావు, మామిడి అనిల్ కుమార్, కె.ఎల్లారెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, బుర్ర తిరుపతిగౌడ్, కరుణాకర్ రెడ్డి, రాజయ్య, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, మడుపు ప్రేమ్ కుమార్, తాళ్లపల్లి నరేష్, ఎండీ ఇర్ఫాన్, కొత్తకొండ శంకర్, కోండ్ర సురేష్, ఎర్రోళ్ల కవిత, మహమూద్, బషీర్, శ్రీకాంత్, ఆసిఫ్, రాకేష్, సుమన్, వినోద్, అశోక్, బక్కారెడ్డి, రుద్రవరం సాయి కుమార్, ముష్కం రాజు కుమార్ మాంకాలి కృష్ణవేణి, జేరిపోతుల సతీష్, రుద్రవరం స్వరూప, ఎడ్ల కనుకా రెడ్డి చల్లూరి విశ్వనాథం, నలువాల రవీందర్ రావు, పోచంపల్లి శ్రీనివాస్, నలువాల ప్రభాకర్ రావు, నలువాల గోపాల్ రావు, శ్రీనివాస్, పోలు శ్రీనివాస్, ఎనగంటి భావనారుషి, కోల వీరేశం, మాజీ ఉప సర్పంచ్ నలువాల రవీందర్ రావు, నలువాల కనుకయ్య, ఎనగంటి శ్రీకాంత్, మునిగాల లక్ష్మిరాజం, చింతల సత్యనారాయణ, తాళ్లపల్లి సంపత్, తాళ్లపల్లి శ్రీనివాస్, తొడుపునూరి వీరేశం, కోల వీరేశం, గంప చంద్రమౌళి, మడ్డి పర్శరాములు, మడ్డి చంద్రయ్య, మడికంటి విక్రమ్, శ్రీనివాస్, గూటం అనిల్ రెడ్డి, అనపురం శ్రీనివాస్, ఆరెపల్లి రవి, శివ, పర్లపల్లి కనుకయ్య, అంతగిరి ఫణీంద్ర, రామగిరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆరు గ్యారంటీల అమలు పట్టించుకున్నారా?

# సోనియాకు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ

హైదరాబాద్, డిసెంబర్ 21(భారతశక్తి ప్రతినిధి) : తెలంగాణలో స్వయంగా ప్రకటించిన 6 గ్యారంటీలు, మేనిఫెస్టో అమలు గురించి ఏనాడైనా తెలుసుకునేందుకు ప్రయత్నించారా? అని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. కనీసం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సమయంలోనైనా వీటి అమలు గురించి ఆరా తీశారా? అంటూ ఓ బహిరంగ లేఖ రాశారు. ''ఆనాడు ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టి.. మళ్లీ ఇప్పుడు విజన్ డాక్యుమెంట్ పేరిట కొత్త హామీలు ఇస్తున్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన గ్యారంటీలను గాలికొదిలేశారా? ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన 420 హామీలను మూసీ నదిలో కలిపేశారా? గాంధీభవన్‌లో పాతరేశారా? తెలంగాణ



ప్రజలకు తెలియజేయాలి. ఇప్పటికైనా కొత్త ఊహలు, కొత్త ఆశలు, కొత్త హామీలు కల్పించే ముందు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. లేదంటే మీరు ప్రయోగించిన అభయహస్తమే ప్రజల ఆగ్రహం రూపంలో మీ పాలిట భస్మాసుర హస్తమై అధికారానికి దూరం చేస్తుంది. తెలంగాణ ప్రజలు మీకు తగిన గుణపాఠం చెబుతారు'' అని కిషన్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలి

* **సూర్యాపేట జిల్లా కలెక్టర్- తేజస్ నంద లాల్ పవర్**

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 21: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని తద్వారా ప్రమాదాలు నివారించి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.రోడ్డు ప్రమాదాలు నివారణ, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు 2026 లకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, రవాణా శాఖ కమిషనర్ వికాస్ రాజ్ లతో కలిసి రాష్ట్ర రవాణా, బి సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పి లు, రవాణా శాఖ, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అధికారులతో విడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో పోలీస్, రవాణా, రెవిన్యూ, ఆర్ & బి, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయం చేసుకుంటూ జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్లను గుర్తించడం జరిగిందని అలాగే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 26% మరణాలు, 9% ప్రమాదాలను తగ్గించడం జరిగిందని వచ్చే సంవత్సరానికి సంబంధించి అన్ని శాఖలను సమన్వయము చేసుకుంటూ కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తామని కలెక్టర్ మంత్రికి వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో



మాట్లాడుతూ చిన్న చిన్న కారణాలతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని ఇట్టి సమస్యను పరిష్కరించే దిశగా 18 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వకూడదని అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలు విద్యార్థులకు, యువకులు తెలియజేసేలా పాఠశాలలో, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్టీసీ బస్సులు,లారీలు రోడ్డుపై ఆపకుండా ప్రక్కన ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ,పోలీస్,రెవెన్యూ, ఆర్ అండ్ బి, హెల్త్,ఇండస్ట్రియల్, పంచాయతీరాజ్ ఇంజనీర్, వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, హాస్టల్స్ లాంటి శాఖలు తమ కార్యచరణ ప్రణాళికను వచ్చే సోమవారం నాటికి అందించాలని ఆదేశించారు. మాసోత్సవాల్లో భాగంగా పాఠశాలలో, రెసిడెన్షియల్ స్కూల్స్ లో వ్యాచరచన పోటీలు,రోడ్ సేఫ్టీ క్లబ్స్ ఏర్పాటు చేయాలని అలాగే పిల్లలకు రోడ్లు ఏ విధంగా దాటాలో అవగాహన కల్పించాలని ఆర్టీసీ బస్టాండ్లలో వారంకు ఒక కార్యక్రమం నిర్వహించి రోడ్డు భద్రత పై ప్రజలకు, డ్రైవర్లకు అవగాహన కల్పించాలని బైకు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరి అని, షీట్ బెల్ట్ ధరించేలా ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్ కార్యాలయంలో పనిచేసే అధికారులు, అలాగే కలెక్టరేట్ కు వచ్చే ప్రజలు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని,వారం రోజులు మాత్రమే గడువు ఇవ్వటం జరుగుతుందని తర్వాత ఎవరైనా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోతే వారి వాహనాలను కలెక్టరేట్లోకి అనుమతించేది లేదని హెచ్చరించారు.మండల స్థాయి లో తహసీల్దార్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత ప్రమాదాలపై కమిటీ ఏర్పాటు చేసి బ్లాక్ స్పాట్స్ గుర్తించి సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు.బ్లాక్ స్పాట్ ల దగ్గర ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జాతీయ రహదారుల నుండి అనుసంధానం అయ్యే మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి రోడ్లకు స్పీడ్ బ్రేకర్లు,సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్లను గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ అలాగే రవాణా శాఖ అధికారులు లారీ డ్రైవర్లతో, స్కూల్ బస్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించి వాహనాలలో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండేలా చూడాలని అలాగే ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.డ్రైవర్లకు హెల్త్ క్యాంపు లు నిర్వహించి టి బి లాంటి అన్ని ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం తోపాటు మందులు ఇవ్వాలని అన్నారు.మున్సిపాలిటీలో స్కూల్ జోన్ లాంటి ప్రాంతాలలో ఆటోలు,రిక్షాలు, క్యాబ్ డ్రైవర్లకు నేమ్మిదిగా వెళ్లేలా మున్సిపల్ కమిషనర్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.సాండ్ టాక్సీ,మైనింగ్ వాహనాలకు ఫిట్ నెస్ సర్టిఫికెట్ ఉంటేనే రేడియం స్టికర్ అతికించాలని, పరిశ్రమలకు చెందిన వాహనాల డ్రైవర్లకు సరిపడే నిద్ర ఉండేలా డ్యూటీ లు ఇచ్చేవిధంగా యాజమాన్యం తో మాట్లాడితో చాలా వరకు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలకి గురైన వారికి తక్షణమే చికిత్స అందించేందుకు 1.50 లక్షల రూపాయలు వారం రోజుల్లో సంబంధిత హాస్పిటల్ కు అందజేస్తుంది కాబట్టి రోడ్డు ప్రమాదాలలో క్షతగాత్రులకు వెంటనే చికిత్స చేయాలని హాస్పిటల్ యాజమాన్యలను కోరారు. రాత్రి పూట పశువులు, కుక్కలు రోడ్లపై సంచరించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నివారించేందుకు తగ్గిన చర్యలు తీసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ఏమైనా ప్రమాదాలు జరిగితే వారికి ప్రథమ చికిత్స చేసి హాస్పిటల్ కు తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.చిన్న చిన్న భద్రత ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించి ప్రాణాలను కాపాడినవారిమి అవుతామని ఇట్టి విషయాన్ని అధికారులు సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా ఎస్పీ కే నరసింహ, అదనపు కలెక్టర్ కె సీతారామారావు, ఆర్డీవో జయప్రకాశ్ రెడ్డి, ఆర్ అండ్ బి ఈ ఈ సీతారామయ్య, పశుసంవర్ధన అధికారి శ్రీనివాసరావు, ఇండస్ట్రియల్ జిఎం సీతారాం,వెల్ఫేర్ అధికారులు శంకర్ నరసింహారావు వెల్ఫేర్ అధికారులు శంకర్, నరసింహారావు, దయానందరాణి, డీఈవో అశోక్ తదితరులు హాజరైనారు.




## కరీంనగర్ టౌన్ పోలీసుల ఘనత


* **సిఈఐఆర్ పోర్టల్..60 మొబైల్ ఫోన్ల రికవరీ**
* **రికవరీ చేసిన ఫోన్ల విలువ 10 లక్షలు**
* **బాధితులకు అందజేసిన టౌన్ ఎసిపి వెంకటస్వామి**

కరీంనగర్, డిసెంబర్ 21(భారతశక్తి ప్రతినిధి) సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ, గల్లంతైన, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను వెలికితీయడంలో కరీంనగర్ టౌన్ డివిజన్ పోలీసులు సి ఈ ఐ ఆర్ ద్వారా 60 మొబైల్ ఫోన్లు రికావరి చేసి విజయం సాధించారని టౌన్ ఎసిపి వెంకటస్వామి అభినందించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు CEIR (సెంట్రల్ ఏక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా చేశారని చెప్పారు. రికవరీ అయిన మొబైల్స్ విలువ సుమారు 10 లక్షలు రూపాయలు ఉంటాయని చెప్పారు. రికవరి ఫోన్లను బాధితులకు సీఐలు సృజన్ రెడ్డి, ఎస్ఐ లతో కలిసి ఎసిపి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ టౌన్ కు చెందిన పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన ఫిర్యాదులపై ప్రత్యేక బృందాలు నిరంతరం నిఘా ఉంచి, టెక్నికల్ అనాలిసిస్ ద్వారా ఈ ఫోన్లను గుర్తించారని తెలియజేశారు. ఈ సందర్భంగా టౌన్ ఏసీపీ ప్రజలకు సూచనలు చేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైనా ఏమాత్రం ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదుతో పాటు స్వయంగా లేదా పోలీసుల సాయంతో www. ceir.gov.in పోర్టల్‌లో మొబైల్ వివరాలను నమోదు చేయాలి. దీనివల్ల ఫోన్ దుర్వినియోగం కాకుండా బ్లాక్ చేయడంతో పాటు, తిరిగి రికవరీ చేసే అవకాశం పెరుగుతుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల ఆస్తులను కాపాడటంలో కరీంనగర్ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.

## యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం కొనగుతుంది

* **రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

రంగారెడ్డి జిల్లా, డిసెంబర్ 21 (భారత శక్తి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీ (సోమవారం) నేటి నుండి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా నేడు కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.



## మహిళల హక్కులకై పోరాడాలి

* **ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి**

కరీంనగర్, డిసెంబర్ 21(భారతశక్తి ప్రతినిధి) : అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా 14వ జాతీయ మహాసభల సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రం ముకుంద లాల్ మిశ్రా భవన్లో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి ఐద్వా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా 14వ జాతీయ మహాసభలు తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదు నగరంలో 2026 జనవరి 25 నుండి 28 తేదీలలో మొదటిసారి గా జరుగుచున్నవి ఈ సందర్భంగా జండా ఆవిష్కరణ చేయడం జరిగిందన్నారు నాలుగు రోజులపాటు జరిగే ఈ మహాసభలలో దేశవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొనే ప్రధానమైన సమస్యలు చర్చించి రూపొందించబోయే భవిష్యత్ కార్యాచరణ, మహిళా, ఉద్యమాలకు దిశా నిర్దేశం చేయనున్నవి అన్నారు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పదేళ్ల కాలంలో, మహిళలు,మైనార్టీలు దళితులు, అట్టడుగు, వర్గాలకు,భద్రతా కరువైంద న్నారు, మహిళలపై హింస అభద్రత నిరుద్యోగం పెరిగిందన్నారు తగ్గుతున్న, స్త్రీపురుష, నిష్పత్తి విద్య వైద్యం,ప్రజలందరికీ,అందుబాటులో లేకపోవడం, పెరుగుతున్న,నిత్యవసర వస్తువుల ధరలు ఒకవైపు




పని దొరక్క పోవడం మహిళలు. సమస్యల వలయంలో కి నెట్టి వేయబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు మహిళలు ఈ బట్టలు వేసుకోవాలి ఏ తిండి తినాలో ఎంతమంది పిల్లల్ని కనాలి అని బిజెపి ప్రభుత్వమే నిర్ణయిస్తుం దన్నరు .మనువాదం. మహిళల. కుస్వేచ్ఛ స్వతంత్రం, ఉండకూడదని, బానిసలుగా బ్రతకాలని శాసిస్తోందన్నారు ఈ మహాసభలలో,మహిళా,సమస్యలపై చర్చించి, భవిష్యత్,కార్యాచరణ రూపొందిస్తుందన్నారు, ప్రజాస్వామ్యం సమానత్వం.స్త్రీ విముక్తి.ఆశయాల కోసం జీవితకాలం,మహిళా,హక్కుల కోసం ,మహిళలు, నిరంతరం పోరాటంలో కొనసాగాలని పిలుపునిచ్చారు, కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఉప్పు నూటి లక్ష్మి. ఎడ్ల రజిత.అనిత. రజిని. తిరుమల విజయ.పద్మ.శారద. కీర్తన. లక్ష్మి తదితరులుపాల్గొన్నారు.

## అంబరాన్నంటిన పారమిత హెరిటేజ్ టెర్రనోవా వార్షికోత్సవం

* **స్కాలర్షిప్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు 8లక్షల నగదుతో సత్కారం**
* **అభినందించిన ఛైర్మన్ ప్రసాద్ రావు**



కరీంనగర్, డిసెంబర్ 21(భారతశక్తి ప్రతినిధి) నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా కాలంతో పోటీపడుతూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని పారమిత విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్ రావు అన్నారు. నగరంలోని పద్మనగర్ లోగల పారమిత హెరిటేజ్ సి.బి.యస్. పాఠశాలలో " టెర్ర నోవా " పేరిట నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. ముందుగా విద్యావేత్త, పారమిత, ఎక్స్ ప్లోరికా విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్ రావు జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. వేడుకల్లో విద్యార్థిని, విద్యార్థులు టెర్రనోవా అంశం ఆధారంగా వార్షికోత్సవంలో అద్భుత ప్రదర్శనలతో అలరించారు. నృత్యాలు, హృదయ స్పందనలను పెంచే పాటలు, ఆలోచనలను రేకెత్తించే నాటకాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. మానవ జీవితం మూలాల నుండి ఒక ఉన్నత స్థితి వరకు ఎదిగే దశ ఆధారంగా రూపొందించి విద్య, వ్యవసాయం, రక్షణ రంగాల గొప్పతనంపై ప్రదర్శించారు. ఈ విద్యాసంవత్సరంలో స్కాలర్షిప్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 6 నుండి 9వ తరగతుల విద్యార్థులకు మొదటి బహుమతి 75,000/ వేలు,, ద్వితీయ బహుమతి 60,000/ వేలు, తృతీయ బహుమతి 50 ,000/వేలు అలాగే 4,5 స్థానాలలో నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి 10,000/ వేలతో మొత్తం 8,20,000/ రూపాయల నగదును ప్రసాదరావు అందజేశారు. ఈ విద్యాసంవత్సరంలో విద్య ఇతర కళలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులను సన్మాన పత్రాలు, జ్ఞాపికలతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రసాద్ రావు మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పారమిత స్కాలర్షిప్ పరీక్ష ను ప్రతీ సంవత్సరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ వార్షికోత్సవ వేడుకల విద్యార్థులకు ఒక అద్భుతమైన అనుభవం మాత్రమే కాదనీ, వారిలో దాగిన సృజనాత్మకతను, నైపుణ్యాలను పెంపొందించేలా చేసాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వినోదరావు,రాకేశ్ ప్రసాద్, ప్రాచీ, వి.యు.ఎం. ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయ కర్తలు నాగరాజు, రాము, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, పాఠశాలల కరస్పాండెంట్ లు, ప్రముఖ విద్యావేత్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






# అక్రమ బంధానికి అడ్డు

* **తండ్రి, భార్య సుపారిలచే భర్తను హత్య**
* **రూరల్ ఎసిపి విజయకుమార్**
* **15రోజుల్లో కేసును చేధించిన పోలీసులకు అభినందనలు**

కరీంనగర్, డిసెంబర్ 21(భారతశక్తి ప్రతినిధి) : వాయివరుసలు... మానవబంధాలు... మానవత్వం ...కుటుంబ బంధాలకు ప్రాధాన్యం ఉండేది. ప్రస్తుత కాలంలో అన్ని బంధాలను తెంచుకుంటూ హిందూ ధర్మానికి విరుద్ధంగా జీవిస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు. ఈ బంధాలను తెంచుకొని ఓ మామ కోడలుతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. మా సంబంధానికి అడ్డువస్తున్నాడని తండ్రి, భార్య ఇద్దరు కలిసి సుపారిలచే హత్యచేశారు. ఈ హత్య ఘటన జరిగింది ఈ నెల 2న రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామంలో జరిగింది.. సంఘటన వివరాలను ఆదివారం రూరల్ ఎసిపి విజయకుమార్ నిందితులను అదుపులోకి తీసుకొని మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గాదె అంజయ్య (36) అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారనీ చెప్పారు. అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంతో తండ్రి, భార్యే సుపారీ ఇచ్చి అంజయ్యను హత్య చేయించినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ దారుణానికి పాల్పడిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

*** ఘటన వివరాలు**

లక్ష్మీపూర్ నివాసి గాదె లచ్చయ్య (63) తన కోడలు శిరీషతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు, 2017లో ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లిన అంజయ్య, 2019లో తిరిగి వచ్చిన తర్వాత తండ్రి, భార్యల మధ్య ఉన్న సంబంధాన్ని చూసి వారిని మందలించాడు. అయినా వారిలో మార్పురాలేదు. ఇద్దరిని మందలించడంతో తమ సాన్నిహిత్యానికి అడ్డుగా ఉన్న అంజయ్యను వదిలించుకోవాలని తండ్రి, భార్య పథకం వేశారు.

*** 3 లక్షలకు సుపారీ**

నేరుగా చంపితే అనుమానం వస్తుందని భావించిన లచ్చయ్య, అదే గ్రామానికి చెందిన కొలిపాక రవి సహాయంతో సుపారీ గ్యాంగ్‌ను సంప్రదించాడు. రవి తన బంధువైన ఉప్పరపల్లి కోటేశ్వర్, అతని స్నేహితుడు మహమ్మద్ అబ్రార్‌లకు అంజయ్యను చంపేందుకు 3 లక్షల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. సుపారీ గ్యాంగ్ అంజయ్యతో స్నేహం పెంచుకున్న కోటేశ్వర్, అబ్రార్‌లు నిత్యం కలిసి మద్యం సేవిస్తున్నారని విచారణలో తేలిందని చెప్పారు.

*** పథకం ప్రకారం హత్య**

ఈ నెల 2వ తేదీ మంగళవారం మద్యం తాగుదామని అంజయ్యను ఊరి చివర ఉన్న కెనాల్ సమీపంలోకి పిలిచి, అమితంగా మద్యం తాగించి, మత్తులోకి జారుకున్నకా కోటేశ్వర్ గొంతు నులమగా, అబ్రార్ చేతులు పట్టుకుని అంజయ్యను హతమార్చారనీ చెప్పారు. నిందితుడు రవి దగ్గరుండి ఈ విషయాన్ని లచ్చయ్యకు చేరవేశాడు. సాక్ష్యాలను మరుగుపరచడానికి చీకటి పడిన తర్వాత మృతదేహాన్ని D8 కెనాల్‌లోకి తోసేశారు.

*** పోలీసుల దర్యాప్తు**

ఈ నెల 5వ తేదీ శుక్రవారం కాలువలో శవం దొరకడంతో, ప్రమాదవశాత్తు పడి చనిపోయాడని నమ్మించేందుకు నిందితులు ప్రయత్నించారు. పోలీసుల లోతైన విచారణలో లచ్చయ్య, శిరీషల ప్రవర్తనపై అనుమానం రావడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజం బయటపడింది.

*** అరెస్టయిన నిందితులు**

గాదె లచ్చయ్య (మృతుడి తండ్రి)
గాదె శిరీష (మృతుడి భార్య)
ఉప్పరపల్లి కోటేశ్వర్ (సుపారీ హంతకుడు)
మహమ్మద్ అబ్రార్ (సుపారీ హంతకుడు)
కొలిపాక రవి (మధ్యవర్తి)

*** స్వాధీనం చేసుకున్న వస్తువులు**

నేరానికి ఉపయోగించిన ఫోన్లు బైక్ (TS02L1367).
నిందితుల వద్ద నుండి సుమారు రూ. 40,000/ నగదు (మిగతా మొత్తం రికవరీ చేయాల్సి ఉంది).

*** పోలీసులకు అభినందనలు**

కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీస్ అధికారులను ఎసిపి విజయ్ కుమార్ అభినందించారు.




## ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ఐదవ సదస్సు

కొత్తగూడెం, డిసెంబర్ 21 (భారత శక్తి): కొత్తగూడెం క్లబ్ లో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదవ తెలంగాణ రాష్ట్ర సదస్సుకు హాజరైన నేషనల్ ప్రెసిడెంట్ సుజాత కె.చౌదంతే, జిల్లా జడ్జి పాటిల్ వసంత్, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు,పాల్గొన్న లాయర్లు. ఐఎల్ పీఏ తెలంగాణా రాష్ట్ర సెక్రటరీ శ్యాంసన్ మాట్లాడుతూ, బీసీ ఎస్సీ, ఎస్టీ మైనారిటీ వర్గాలకు జరుగుతున్న అన్యాయాలు, వారిపై దాడులను ఎదుర్కొనేందుకు, మార్జినలైజ్డ్ కమ్యూనిటీస్ ను ప్రొటెక్ట్ చేసేందుకు,బలహీన వర్గాల నుంచి వచ్చిన న్యాయవాదులకు న్యాయస్థానాల్లో లీగల్ గా,ధీటుగా వాదనలను వినిపించేందుకు వారికి సబ్జెక్టు వైజ్ గా శిక్షణ,వృత్తిలో రాణించేందుకు ఉచితంగా వర్క్ షాప్ లు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఆన్ లైన్ కోచింగ్ లు ఇస్తున్నామని,ఈ సంస్థలో కోచింగ్ పొందినవారు 65 మంది ఏపీపీలుగా సుమారు 15 మంది జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికయ్యారని తెలిపారు. నిధులు లేక సరైన ప్రోత్సాహంలేని అడ్వకేట్లను ఐఎల్ పిఏ ప్రోత్సహిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన న్యాయవాదులు కోర్టులో ఎటువంటి భయం లేకుండా సరైన వాదనలు వినిపించేందుకు ఇంగ్లీష్ భాషలో ప్రత్యేక శిక్షణ ఇస్తుందన్నారు.ఐఎల్ పీఏ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం దేవరాజు గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తుందని సమాజంలో అన్యాయానికి వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో సైతం ఐఎల్ పిఏ పాల్గొన్నట్లు తెలిపారు. రాజ్యాంగ ప్రకారం రావాల్సిన హక్కులు దక్కేలా చూడటం దేశంలో 1931లో కుల గణన బ్రిటిష్ కాలంలో జరిగిందని ఆనాటి నుంచి నేటి వరకు ఏ ఒక్క పాలకులు ప్రభుత్వం కులగణన చేయలేదని విమర్శించారు. ఆర్టికల్ 340 ప్రకారం దేశంలో కుల జన గణన జరగాలని డిమాండ్ చేశారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ అన్నివర్గాలకు రావలసిన హక్కులు రిజర్వేషన్లు లభించేలా ఐఎల్ పిఏ అండగా ఉంటుందని రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా ఐఎల్ పిఏ ఉంటుందని, అవసరమైతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు..

## మా భవిష్యత్ మీ చేతిలో ఉంది : చైతన్యపురి వాసులు

* **ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి విజ్ఞాపన చేసిన కాలనీవాసులు**
* **గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని విన్నపం**



ఎల్బీనగర్, డిసెంబర్ 21(భారత శక్తి) : ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని చైతన్యపురి డివిజన్ విద్యుత్ నగర్, ప్రభాత్ నగర్ కాలనీ, సత్యనారాయణ పురం, మారుతీ నగర్, డివిజన్ చుట్టుపక్కల కాలనీవాసులు ఆదివారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని ఆయన ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో మీ చొరవతో గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ కోహెడకు అనంతరం అక్కడినుండి బాట సింగారం తరలించి ఇక్కడ ప్రభుత్వ స్థలంలో టీమ్స్ పేరిట 28 అంతస్థుల మల్టీ స్పెషాలిటీ ప్రభుత్వ హాస్పిటల్ నిర్మించేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తో కలిసి మీరు(సుధీర్ రెడ్డి)కూడా భూమి పూజ చేశారని గుర్తు చేశారు. అప్పుడు మీరు చొరవ తీసుకొని హాస్పిటల్ సమీపంలోనే వెయ్యి చదరపు గజాల స్థలంలో పోలీస్ స్టేషన్ కోసం స్థలం కేటాయించాలని కోరడంతో వారు సానుకూలంగా స్పందించి మంజూరుచేశారని, అలాగే హాస్పిటల్ కు అనుసంధానంగా ఇంకొక రెండు వేల గజాల స్థలంలో చిల్డ్రన్స్ పార్క్, విద్యుత్ సబ్ స్టేషన్ కోసం స్థలం కేటాయించారు.హాస్పిటల్ నిర్మాణ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయని,కానీ ప్రస్తుత ప్రభుత్వం 14 అంతస్థులకు పరిమితి చేయడంతో పాటు పోలీస్ స్టేషన్,పార్క్,విద్యుత్ స్టేషన్ కోసం కేటాయించిన భూమి ఇచ్చే అవకాశం లేదని, తెలిసింది. భవిష్యత్ నందు మంచినీరు, విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే,ఇక్కడి భూమిలో మళ్ళీ యథాతథంగా నిర్మాణాలు చేపట్టాలని వారు కోరారు. అలాగే మా కాలనీ నందు ఉన్న మాధవరెడ్డి కమ్యూనిటి హాల్ ను చైతన్యపురి పోలీస్ స్టేషన్ కోసం అధికారులు అడుగుతున్నారని,ఈ నిర్ణయం విరమించుకోవాలని కోరారు. అలాగే కొన్ని కాలనీలలో రోడ్లు గుంతలు పడి, నరకయాతన పడుతున్నామని,కొత్తగా రోడ్లు వేయాలని కోరారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ,ఇక్కడ కడుతున్న టిమ్స్ హాస్పిటల్ ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిన నిర్మాణాల్లో భాగంగా కొన్ని రోజుల క్రితం స్థానిక ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబుని కలిసి హాస్పిటల్ పరిసరాల్లో రద్దు చేసిన వాటిని మంజూరు చేయాలని కోరామని గుర్తు చేశారు. తప్పకుండా హాస్పిటల్ పరిసరాల్లో భారాస చెప్పిన నిర్మాణాలు చేసే విధంగా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అలాగే మీ కమ్యూనిటీ హాల్ నందు పోలీస్ స్టేషన్ విషయంలో పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడతానని,రోడ్ల విషయంలో అధికారులతో మాట్లాడి నూతన రోడ్లు మంజూరు చేయిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, సొంటి చంద్రశేఖర్ రెడ్డి,బాల్ రెడ్డి, రమణారెడ్డి, గట్టు శ్రీను, జయశ్రీ, సుధాకర్,వెంకట్, నాగేందర్, రాజేష్,చందు, రాజిరెడ్డి, పవన్,వీరన్న యాదవ్,జాఫర్ తదితరులు పాల్గొన్నారు.






## తదుపరి ఎస్ఐఆర్ తెలంగాణలోనే

**: సీఈసీ జ్ఞానేశ్‌కుమార్**



హైదరాబాద్, డిసెంబర్ 21 (భారత శక్తి): బిహార్‌లో బీఎల్‌వోలు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను విజయవంతంగా నిర్వహించి దేశానికి మార్గదర్శనం చేశారని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ తెలిపారు. తెలిపారు. తదుపరి అదే ప్రక్రియ తెలంగాణలో అమలు చేయబోతున్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో బూత్ లెవెల్ ఆఫీసర్లతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఇంటరాక్టివ్ సమావేశం నిర్వహించారు. ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే స్థాయికి భారత కేంద్ర ఎన్నికల సంఘం ఎదిగిందని.. రాబోయే ఒక సంవత్సరం పాటు అంతర్జాతీయ 'ఇంటర్నేషనల్ ఐడియా' సంస్థకు కేంద్ర ఎన్నికల కమిషనరే నాయకత్వం వహించనున్నారని వెల్లడించారు. కెనడా దేశం కంటే తెలంగాణలోనే ఎక్కువ మంది ఓటర్లు ఉన్నారని, .అంత పెద్ద సంఖ్యలో ఓటర్లు ఉన్న రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత BLOలపై ఉందని తెలిపారు. దేశంలో ఎన్నికల నిర్వహణ కోసం 1.80 కోట్ల మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల యంత్రాంగమని పేర్కొన్నారు. బిహార్‌లో ఎన్నికలను 7 దేశాల నుంచి వచ్చిన 20 మంది ప్రతినిధులు పరిశీలించారని, అంతర్జాతీయంగా భారత ఎన్నికల వ్యవస్థకు గుర్తింపు లభించిందని చెప్పారు. ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత 7.5 కోట్ల ఓటర్లతో జాబితా విడుదల చేశామని, ఈ ప్రక్రియపై ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని తెలిపారు. ఎన్నికల అనంతరం రికౌంటింగ్ విషయంలో కూడా సున్నా ఫిర్యాదులే వచ్చాయని, దానికి కారణం BLOల సమర్థ పనితీరేనని ప్రశంసించారు. తెలంగాణలోఒక BLOకి సగటున 930 మంది ఓటర్లు ఉన్నారని..SIR సమయంలో చనిపోయిన వారి పేర్లు, డబుల్ ఓట్లు వంటి లోపాలు బయటపడతాయన్నారు. అలాంటి లోపాలను సరిచేయడానికే SIR అవసరమని వివరించారు. దేశ రాజ్యాంగానికి అతిపెద్ద సైనికులు బూత్ లెవెల్ ఆఫీసర్లేనని.. ప్రస్తుతం దేశంలో 12 రాష్ట్రాల్లో SIR కొనసాగుతోందని, భవిష్యత్తులో మిగతా రాష్ట్రాల్లో కూడా అమలు చేస్తామని తెలిపారు. తెలంగాణలో SIRను అందరం కలిసి విజయవంతం చేద్దాం అంటూ BLOలకు జ్ఞానేశ్ కుమార్ పిలుపునిచ్చారు.

## రోడ్డును సగం ఆక్రమించిన కంటైనర్ తొలగించిన మహిళ కార్పొరేటర్

* **ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని స్వీట్ షాప్ ఓనర్**
* **స్వీట్ షాప్ ద్వారానికి తన కారు అడ్డంగా పెట్టి ఛాలెంజ్ చేసిన మహిళా కార్పొరేటర్**
* **కంటైనర్ తీసేవరకు కారును కదపని కార్పొరేటర్**



ఎల్బీనగర్, డిసెంబర్ 21 (భారత శక్తి): సరూర్ నగర్ డివిజన్ కొత్తపేట చౌరస్తాలోని శివరామ రెడ్డి స్వీట్స్ షాప్ ఈ చుట్టుపక్కల తెలియని వారు ఉండరు. కానీ అదే షాప్ యజమాని గత ఆరు నెలల నుండి ప్రైవేట్ స్థలంలో ఉన్న కంటైనర్ ను హుడా కాలనీ రోడ్డు నెంబర్ 1 లో అడ్డంగా పెట్టారు. కాలనీ వాసులు ఎంతగానో బతిమిలాడినా, జిహెచ్ఎంసి, ట్రాఫిక్ అధికారులకు, సివిల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇసుమంత కూడా లెక్కచేయకుండా అక్కడినుండి కంటైనర్ కదపలేదు. హుడా కాలనీ వాసులు ఈ క్రమంలో సరూర్ నగర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణికి ఫిర్యాదు చేయగా, కాలనీ వాసులకు అండగా శివ రామ రెడ్డి స్వీట్ షాప్ వారు అక్రమంగా ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా కంటైనర్‌ను రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేశారని దాని వల్ల ఆ ప్రదేశం అడ్డాగా మారి, రావడానికి పోవడానికి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని సంబంధిత వారికి పలుమార్లు చెప్పినా వారు పట్టించుకోకపోవడంతో ఆదివారం ఉదయం శివ రామ రెడ్డి స్వీట్ షాప్ ద్వారానికి అడ్డంగా తన కారును పార్క్ చేసి కంటైనర్ ఇక్కడినుండి తీసేవరకు కారు అలాగే ఉంటదని ఛాలెంజ్ చేయడం జరిగింది. అయినా స్వీట్ షాప్ యజమాని కానరాలేదు. షాప్ యజమాని ఎంతకు రాకపోయేసరికి హుడా కాలనీ స్థానికులు, జిహెచ్ఎంసి సిబ్బందితో కలిసి క్రేన్ సహాయంతో ఆ కంటైనర్‌ను అక్కడి నుంచి తొలగించడం జరిగింది. ప్రజల సమస్యలపై రాజకీయాలు చేసే వాళ్లకు సమాధానం ఇలాగే స్పష్టంగా గట్టిగా ఉంటుందని, ఎలాంటి సమస్యలున్నా నన్ను సంప్రదించాలని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి తెలిపారు. ఈ కంటైనర్ తొలగింపు కార్యక్రమంలో ఆకుల అంజన్ కుమార్, నర్సింహా రెడ్డి, శివకుమార్, కబీర్ దాస్, గోవర్ధన్ బీజేపీ కార్యకర్తలు, జిహెచ్ఎంసి సిబ్బంది సత్య, స్వామి, నగేష్ పాల్గొన్నారు.



# నాణ్యమైన విద్యే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

*** టీఆర్టీఎఫ్ విద్యా సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు**

ఎల్బీనగర్, డిసెంబర్ 21 (భారత శక్తి): విద్యారంగాన్ని సమూలంగా బలోపేతం చేసి దేశానికే ఆదర్శంగా నిలపాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్ నాగోల్‌లో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) 80 వసంతాల అభ్యుదయోత్సవ విద్యా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించారని, అదే ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యాశాఖలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు స్వయంగా ముఖ్యమంత్రే విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 37 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు, 23 వేల మందికి పదోన్నతులు కల్పించామని, 11 వేల టీచర్ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నిర్వహించి కేవలం నాలుగు నెలల్లోనే నియామకాలు పూర్తి చేయడం రికార్డు స్థాయిలో జరిగిందన్నారు. విద్యారంగంలో సమూల సంస్కరణల కోసం విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని, కమిషన్ సూచనలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆర్థిక సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సదస్సులో రాష్ట్ర బీసీ సంక్షేమ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులను పాఠశాలల్లో ప్రశాంతంగా ఉంచే బాధ్యత ప్రభుత్వదేనని అన్నారు. బదిలీలు, పదోన్నతుల సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని,317 జీవో బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. గత పాలనలో నెలల తరబడి వేతనాలు ఆలస్యమయ్యాయని, ప్రస్తుతం ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు.సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో నూతన ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను అన్ని సౌకర్యాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఇది విద్యావ్యవస్థలో కీలక మార్పుగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాసిం, పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ కందిమల్ల లింగయ్య, వరంగల్ ఆర్జేడి నారాయణరెడ్డిలతోపాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సుమారు మూడు వేల మంది టీఆర్టీఎఫ్ ప్రతినిధులు ఈ విద్యా సదస్సుకు హాజరయ్యారు.

## జగన్‌కు చంద్రబాబు, పవన్, షర్మిల బర్త్‌డే విషెస్



అమరావతి, డిసెంబర్ 21 (భారత శక్తి): వైకాపా అధ్యక్షుడు జగన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''జగన్‌కు దీర్ఘాయుష్షు, ఆరోగ్యకర జీవితాన్ని భగవంతుడు ప్రసాదించాలి'' అని చంద్రబాబు పేర్కొన్నారు. ''జగన్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం, సుఖసంతోషాలు అందించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను'' అని పవన్ పోస్ట్ చేశారు. జగన్‌కు దేవుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు షర్మిల పేర్కొన్నారు. జగన్‌కు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జగన్ నిండు నూరేళ్లు ఆరోగ్యంతో, ప్రజాసేవలో కొనసాగాలన్నారు.



## అగ్నిమాపక కేంద్ర నిర్మాణానికి సన్నాహాలు

**: జిల్లా ఫైర్ అధికారి బి.కేశవులు**



ఎల్బీనగర్, డిసెంబర్ 21 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ డివిజన్ లో అగ్నిమాపక కేంద్ర నిర్మాణానికి సన్నాహాలు చేపడుతున్నట్లు రంగారెడ్డి జిల్లా ఫైర్ అధికారి 2 బి.కేశవులు తెలిపారు. ఫైర్ అధికారి కేశవులు, జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి (ఎల్బీనగర్) బి. శ్రీనయ్య సూచనలతో ఆదివారం ఫైర్ స్టేషన్ స్థలంలో సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బి.కేశవులు మాట్లాడుతూ, సరూర్ నగర్, బాలాపూర్ ప్రజల అగ్ని ప్రమాద సంక్షేమం దృష్టా గత రెండు సంవత్సరాల క్రితమే ఎల్బీనగర్ ఫైర్ స్టేషన్ ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం గల వాహనాలతో డివిజన్ హెడ్ ఆఫీస్ మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఫైర్ స్టేషన్ నిర్మాణానికి గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ 9వందల గజాల స్థలాన్ని అగ్ని మాపక కేంద్ర నిర్మాణానికి సరూర్ నగర్ లో మంజూరు చేశారని, వచ్చే ఏడాది 2026 సంవత్సరానికి గాను అగ్ని మాపక కేంద్ర నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ కేంద్ర అగ్ని మాపక అధికారి పి.శ్రీధర్, ఎల్బీనగర్ కేంద్ర అగ్ని మాపక అధికారి 2 బి.నరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.



## కర్నూలు జిల్లా టీడీపీ అధ్యకురాలిగా గుడిసె ఆది కృష్ణమ్మ

కర్నూలు, డిసెంబర్ 21 (భారత శక్తి): కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలిగా ఆధికృష్ణమ్మను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించించింది. ఈ మేరకు ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి కృష్ణమ్మను జిల్లా పగ్గాలు అందించినట్టు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కృష్ణమ్మ నివాసానికి చేరుకుని కృష్ణమకు పార్టీ క్యాడర్, కూటమి నాయకులు, ఎమ్మెల్యే పార్థసారథి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ ఒక BC మహిళగా రాజకీయ చదరంగం, రణరంగంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నాని తెలిపారు. సేవే లక్ష్యం, ప్రేమే మార్గంగా జిల్లాలో ఆమె పని చేశారన్నారు. ప్రజలపై కృష్ణమ్మకు ఉన్న అంకిత భవానికి అధిష్టానం ఆమెకు కర్నూలు జిల్లా పట్టంకట్టిందని చెప్పారు. కృష్ణమ్మ రాజకీయంగా మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు .

## వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు



జగ్గంపేట, డిసెంబర్ 21(భారత శక్తి): రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జగ్గంపేట నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ మంత్రి తోట నరసింహం ఆధ్వర్యంలో ఆదివారం జగ్గంపేట పార్టీ కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రస్తుత ఎంపీటీసీలు, పలువురు సర్పంచులు హాజరయ్యారు. ముందుగా వైఎస్ జగన్మోహన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కటింగ్ నిర్వహించారు. అనంతరం జగ్గంపేట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని తోట నరసింహం స్వయంగా ప్రారంభించి పర్యవేక్షించారు.ఈ శిబిరంలో ఆయన తనయుడు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ మొదటగా రక్తదానం చేయగా, అనంతరం పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా రక్తదానం చేశారు. శిబిరంలో సేకరించిన రక్తాన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో అత్యవసర చికిత్స అవసరమైన వారికి అందజేస్తామని తోట నరసింహం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ ఆదేశాల మేరకు జగ్గంపేట నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. వైఎస్ జగన్ హయాంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం కూటమి ప్రభుత్వం చేసిన అన్యాయమని ఆయన విమర్శించారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక కోటి నాలుగు లక్షల 11,136 సంతకాలు సేకరించి గౌరవనీయులైన గవర్నర్‌కు సమర్పించామని తెలిపారు. ఏ ప్రభుత్వం అయినా ప్రజల మద్దతుతోనే ముందుకు సాగాలని, కానీ కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం నశించిందని ఆయన వ్యాఖ్యానించారు. "ఏజెన్సీ అంటే జగన్ కంచుకోట" అని పేర్కొంటూ, 2014 నుంచి తనతోపాటు పనిచేస్తున్న పార్టీ కార్యకర్తలు, నాయకులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 43 మంది రైతులను ముంచి.. పరార్

అనంతపురం, డిసెంబర్ 21 (భారత శక్తి): 43 మంది రైతులను ముంచి పరారయిన మరో రైతు ఉదంతం అనంతపురం జిల్లా బొమ్మనహాళ్‌లో జరిగింది. ధర్గాహొన్నూరు గ్రామానికి చెందిన రైతు మనోహర్ కొన్నేళ్లుగా వ్యవసాయం సాగు చేశారు. స్థానికంగా ఉన్న రైతులతో పరిచయాలు పెంచుకున్నారు. అలా వ్యవసాయం పెట్టుబడి కోసం 43 మంది రైతులు, వ్యవసాయ కూలీలను నమ్మించి రూ. 40.85 లక్షలు అప్పుగా తీసుకున్నారు. వ్యవసాయం చేశారు. నష్టాలు వచ్చాయని చెప్పి ఉన్న ఇంటి, తన నాలుగు ఎకరాల పొలాన్ని అమ్మాడు. దీంతో తమకు ఎప్పుడు ఇస్తావని రైతులు నిలదీశారు. అప్పు తీర్చలేని పరిస్థితుల్లో ఉన్నానని, ఐపీ పెట్టి నోటీసులు ఇచ్చారు. దీంతో బాధిత రైతులు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించడంతో అప్పు తీర్చుతానంటూ నమ్మబలికాడు. ఆ తర్వాత ఊరి నుంచి వెళ్లిపోయారు. దీంతో 43 మంది బాధిత రైతులు, వ్యవసాయ కూలీలు లబోదిబోమంటున్నారు.

## నాకు పునర్జన్మ ఇచ్చారు.. జీవితాంతం రుణపడి ఉంటా

**: పవన్ కల్యాణ్**



విజయవాడ, డిసెంబర్ 21 (భారత శక్తి): నాకు పునర్జన్మను ప్రసాదించి, అడుగడుగునా ధైర్యం, బలం అందిస్తూ నన్ను నడిపిస్తున్న నా ఇష్టదైవం కొండగట్టు అంజన్న స్వామి వారి సన్నిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం కల్పించినందుకు స్వామివారికి మనస్ఫూర్తిగా ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కొండగట్టు దేవాలయ అభివృద్ధి కోసం ప్రతిపాదన చేయగానే ముందుకు వచ్చి నిధులు మంజూరు చేసిన తిరుమల తిరుపతి దేవస్థానాల బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, అలాగే తిరుమల శ్రీవారి భక్తులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిధుల ద్వారా కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యాలు కలగాలని, స్వామివారి కృపతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కాగా, కొండగట్టు అంజన్న ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ. 35.19 కోట్ల నిధులను మంజూరు చేసింది. భక్తుల సౌకర్యార్థం వంద గదుల ధర్మశాల, దీక్షామండపం నిర్మించనున్నారు.

## దేవుడి ఆలయానికి వెళ్తే.. తీవ్ర విషాదం



శ్రీకాకుళం, డిసెంబర్ 21 (భారత శక్తి): దేవుడి ఆలయానికి వెళ్లిన కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో జరిగింది. బాలురులు ధనుష్, పవన్ సాయితో కలిసి తల్లిదండ్రులు ఆముదాలవలస ఉమారామలింగేశ్వర ఆలయం వద్దకు వెళ్లారు. స్వామివారిని దర్శించుకోవాలని అనుకున్నారు. అయితే పుష్కరిణిలో స్నానం చేస్తున్న సమయంలో ప్రమాదవ శాత్తు ధనుష్, పవన్ సాయి నీటిలో గల్లంతయ్యారు. కొద్ది సేపటికే నీటిలో మునిగిపోయారు. పిల్లలను రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఇద్దరూ మృతి చెందారు. దీంతో స్థానికంగా విషాదచాయలు అలుముకున్నాయి.

# ఆ యుద్ధంలో పోరాడిన బెటాలియన్.. ఇప్పుడు త్రిపురలో ఉంది - సీఎం సాహా



బంగ్లాదేశ్‌లో ఇటీవల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఈశాన్య రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. తాజా పరిణామాలపై త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా కీలక వ్యాఖ్యలు చేశారు. 1971లో భారత్‌పాక్ యుద్ధంలో పోరాడిన సైనిక బెటాలియన్‌ను ఈశాన్య రాష్ట్రంలో మోహరించామన్నారు. భాజపా లీగల్ సెల్ అగర్తలాలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో సాహా ఈ విధంగా మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటుచేసుకుంటున్న ఘటనలు, వాటి ప్రభావం దిల్లీపై పడే అవకాశమున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి నివేదికలను పంపిస్తున్నానని త్రిపుర సీఎం పేర్కొన్నారు. ముక్తి వాహిని (బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో కీలక పాత్ర పోషించిన సాయుధ గెరిల్లా దళం)కి శిక్షణ ఇచ్చి, 1971 యుద్ధంలో పాల్గొన్న భారత సైన్యానికి చెందిన అదే బెటాలియన్ ఇప్పుడు రాష్ట్రంలో ఉందన్నారు. ''అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఆర్మీ లేదని ప్రజలు అంటున్నారు. ఈ రోజుల్లో యుద్ధం చేసేందుకు భౌతికంగా అక్కడ ఉండాల్సిన అవసరం లేదు. శత్రువులను మట్టుపెట్టడానికి ఒక్క మీట నొక్కితే చాలని ఆపరేషన్ సిందూర్ నిరూపించింది. షేక్ హసీనా దేశం విడిచిన తర్వాత అక్కడి పోలీసులు, ఆర్మీ మౌనంగా ఉండిపోగా.. వేలాది మంది ఫండమెంటలిస్టులు, నేరస్థులు, చోరీలకు పాల్పడిన వారు జైళ్లనుంచి బయటకు వచ్చారు. భారత్ ఎదుగుదలను ఓర్వలేని కొన్ని శక్తులు తాత్కాలిక సారథిని నియమించాయి'' అని మానిక్ వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో అస్థిరతకు పాకిస్థాన్ ప్రేరేపణలే కారణమన్నారు. 1971 యుద్ధం సమయంలో భారత సైన్యంలోని పర్వత ప్రాంత విభాగాలు కీలక పాత్ర పోషించాయి. దాదాపు 20 పర్వత విభాగాలతోపాటు 8, 6, 4వ డివిజన్లు నాటి తూర్పు పాకిస్థాన్ (ప్రస్తుతం బంగ్లాదేశ్)లో ముఖ్య భూమిక వహించాయి.

## ధ్యానం అంటే ఏంటి?

# అది మనకు అపరిచితమా?

**: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ ప్రత్యేక వ్యాసం**



చలనం నుంచి నిశ్చలతకు.. శబ్దం నుంచి నిశ్శబ్దానికి చేసే ప్రయాణమే ధ్యానం. ధ్యానం చేయాలనే ఆశయం ప్రతి మనిషిలో ఉంటుంది. ఎందుకంటే ఎన్నటికీ తరిగిపోని ఆనందాన్ని, వక్రీకరించని ప్రేమను, ప్రతికూల భావోద్వేగాలుగా మారని శుద్ధమైన అనుభూతిని కోరుకోవడం అనేది మానవ జీవన స్వభావం.

**ధ్యానం మనకు అపరిచితమా?**

అస్సలు కాదు.. మీరు పుట్టకముందే కొన్ని నెలలపాటు ధ్యానంలోనే గడిపారు. మీ తల్లి గర్భంలో మీరు ఏమీ చేయకుండా ఉండేవారు. ఆహారం నమలాల్సిన అవసరం కూడా లేదు. అది నేరుగా మీకు అందేది. ద్రవంలో తేలుతూ, కొన్నిసార్లు కదులుతూ, ఎక్కువ సమయం ప్రశాంతంగా తేలియాడుతూ ఉండేవారు. అదే ధ్యానం.. అదే సంపూర్ణ సౌకర్య స్థితి. అందుకే ప్రతి మనిషిలో, ప్రతి ఆత్మలో, ఆ సంపూర్ణ సుఖస్థితిని మళ్లీ అనుభవించాలనే కోరిక సహజంగానే ఉంటుంది. మీ అసలైన స్వాభావికమైన ఆ ప్రశాంతతకు తిరిగి చేరడమే ధ్యానం.

* పూర్ణ ఆనందమే ధ్యానం.
* ఉత్కంఠ లేని సంతోషమే ధ్యానం.
* ఆందోళన లేని ఉత్సాహమే ధ్యానం.
* ద్వేషం లేదా వక్రీకరణ లేని ప్రేమే ధ్యానం.
* కలత లేని మనసే ధ్యానం.
* ప్రస్తుత క్షణంలో ఉన్న మనసే ధ్యానం.
* సంకోచం లేని, అంచనాలు లేని మనసే ధ్యానం.
* తన మూలానికి తిరిగి వచ్చిన మనసే ధ్యానం.

ధ్యానం అంటే భవిష్యత్తుకోసం వేసే అన్ని ప్రణాళికలను వదిలేయడం. అతిగా ప్రణాళికలు వేస్తుంటే అవి మనల్ని మనలోనికి లోతుగా ప్రవేశించకుండా అడ్డుకుంటాయి. కోరికలు వచ్చినప్పుడు వాటిని పట్టుకోకుండా, కలలుగా మార్చకుండా, వాటిని అర్పించాలి. ధ్యానం అంటే ఈ క్షణాన్ని అంగీకరించడం, ప్రతి క్షణాన్నీ సంపూర్ణతతో జీవించడం. కేవలం ఈ అవగాహన మాత్రమే కాకుండా, కొన్ని రోజులు నిరంతరంగా ధ్యానం చేయడం ద్వారా కూడా మీ జీవన నాణ్యత పూర్తిగా మారిపోతుంది.

# దిల్లీలో పొగమంచు ఎఫెక్ట్.. 110 విమానాలు రద్దు.. 370 సర్వీసులు ఆలస్యం



ఉత్తరాది రాష్ట్రాల్లో పొగ మంచు తీవ్రత కొనసాగుతోంది. తీవ్ర మంచుతో జనజీవనానికి ఆటంకం ఏర్పడుతోంది. దట్టమైన పొగమంచు కారణంగా దేశ రాజధానిలో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఆదివారం 110 విమాన సర్వీసులు రద్దవ్వగా, వందలాది సర్వీసులు ఆలస్యంగా నడిచినట్లు దిల్లీ విమానాశ్రయ వర్గాలు వెల్లడించాయి. ఫ్లైట్‌రాడార్24 గణాంకాల ప్రకారం.. దిల్లీకి రాకపోకలు సాగించే 370 విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ నుంచి బయలుదేరే విమానాలు సగటున 26 నిమిషాలు ఆలస్యమవుతున్నట్లు అంచనా. అంతరాయం కలుగుతున్నప్పటికీ విమాన కార్యకలాపాలు సజావుగానే సాగుతున్నాయని దిల్లీ ఎయిర్‌పోర్టు పేర్కొంది. విమాన సర్వీసులకు సంబంధించి ఎప్పటికప్పుడు అడ్వైజరీలు జారీ చేస్తోంది. దిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి నిత్యం దాదాపు 1300 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దిల్లీతోపాటు ఉత్తరాది నగరాల్లోనూ మంచు తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రతికూల వాతావరణంతో అనేక రైలు సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. మరోవైపు, దేశ రాజధానిలో గాలినాణ్యత ఆందోళనకర స్థాయిలో కొనసాగుతోంది. నగరంలోని 16 పర్యవేక్షణ కేంద్రాల్లో ఏక్యూఐ అత్యంత తీవ్రంగా ఉండగా.. మిగతా ప్రాంతాల్లో తీవ్రంగా ఉన్నట్లు సమాచారం.

# నాయకత్వ మార్పు అంశం.. హైకమాండ్‌పై నిందలా? ఖర్గే



కర్ణాటకలో నాయకత్వ మార్పుపై గత కొన్ని రోజులుగా జోరుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై హైకమాండ్ ఎలాంటి గందరగోళం సృష్టించలేదని, స్థానిక స్థాయిలోనే సమస్య ఉందని స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానంపై నిందలు వేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కలబురగిలో విలేకరులతో మాట్లాడుతూ.. హై కమాండ్‌పై నిందలు వేయడం కంటే అంతర్గత వివాదాలకు స్థానిక నాయకులే బాధ్యత వహించాలన్నారు. ఎన్నికల్లో తమ వల్లే పార్టీ విజయం సాధించిందని కొందరు ప్రకటించుకోవడంపై ఖర్గే సీరియస్ అయ్యారు. ''పార్టీ నిర్మాణంలో ప్రతిఒక్కరి భాగస్వామ్యం ఉంది. ఒక్కరి కృషివల్లే జరగలేదు. కార్యకర్తలే మనకు మద్దతుగా నిలిచారు'' అని ఖర్గే వ్యాఖ్యానించారు. నాయకులు వ్యక్తిగతంగా గొప్పలు చెప్పుకోవడం మానేసి కార్యకర్తల సమష్టి కృషిని గుర్తించాలన్నారు. పార్టీ అధిష్టానాన్ని కలిసేందుకు డీకే శివకుమార్ దిల్లీ వెళ్తున్నారా? అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ఈ విషయంపై తనకు సమాచారం లేదన్నారు. సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ల మధ్య అధికార పోరు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకోవడంలో పార్టీ హైకమాండ్ తనకు మద్దతుగా నిలుస్తుందన్న విశ్వాసం ఉందని సిద్ధరామయ్య పేర్కొనడం, మరోవైపు డీకే కూడా దిల్లీ పర్యటనకు సిద్ధమైన వేళ ఖర్గే వ్యాఖ్యలు కీలక ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు

# విట్ - భోపాల్ 'కాలేజీ చలో అభియాన్'




సెహోర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం విట్ భోపాల్ యూనివర్సిటీ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉన్నత విద్యావకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు 'కాలేజీ చలో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించింది. 12వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కోసం ఈ కార్యక్రమాన్ని రూపొందించి 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశ ప్రక్రియ, వివిధ రంగాల్లో ఉద్యోగావకాశాలు, స్కాలర్‌షిప్‌లకు ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. ఉన్నత విద్యావకాశాలపై విద్యార్థుల్లో తలెత్తిన సందేహాలను యూనివర్సిటీ అధ్యాపకులు నివృత్తి చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే, ఉన్నత విద్యనభ్యసించాలనే విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడంలో ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# ఆర్మీకి 'అశనీ దళం' వెన్నుదన్ను.. సైన్యం చేతికి మట్టి అంటకుండా..!



భారత అమ్ములపొదిలోకి మరిన్ని అధునాతన సాంకేతిక ఆయుధాలు చేరనున్నాయి. 850 ఆత్మాహుతి డ్రోన్ల (కామికాజి) కొనుగోలు ప్రక్రియ తుదిదశలో ఉంది. డిసెంబర్ చివరి వారంలో జరగనున్న రక్షణ మంత్రిత్వశాఖ ఉన్నతాధికారుల సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఘటన నేపథ్యంలో.. భారత్ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. సాంకేతికను అందిపుచ్చుకుంటూ ప్రాణనష్టం జరగకుండా.. శత్రు మూకల్ని అంతం చేసేందుకు వీలుగా ఆత్మాహుతి డ్రోన్లను సమకూర్చుకుంటోంది. కేవలం ఆర్మీలోనే కాకుండా నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లోనూ ఈ తరహా డ్రోన్ల వాడకాన్ని మరింత పెంచుకోవాలన్న లక్ష్యంతో మొత్తం 30 వేల డ్రోన్లను సమకూర్చుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగానే తొలి విడతగా 850 డ్రోన్ల కొనుగోలు ప్రక్రియ ఊపందుకుంది.

**ఏంటీ ఆత్మాహుతి డ్రోన్లు?**


ఈ ఆత్మాహుతి డ్రోన్లను నేషనల్ ఏరోస్పేస్ లేబొరేటరీస్ అభివృద్ధి చేస్తోంది. వెయ్యి కిలోమీటర్ల దాకా ఎగరగలవు. రాడార్ల కళ్లుగప్పి.. లక్ష్యాలను ఛేదించగలవు. రష్యా ఉక్రెయిన్ యుద్ధంలోనూ ఇలాంటి డ్రోన్లను వినియోగిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటన్, దాని మిత్రదేశాల నౌకా దళాలపై దాడులకు జపాన్ తన యుద్ధవిమానాలను ఆత్మాహుతి దాడులకు వాడింది. వారిని కామికాజి ఆత్మాహుతి దళాలుగా పిలిచేవారు. ఈ తరహాలోనే డ్రోన్‌లు పనిచేయనున్నాయి.

* **ఆర్మీకి వెన్నుదన్నుగా అశనీ దళం!**

భారత పదాతి దళం ఈ రకం డ్రోన్ల వినియోగాన్ని గణనీయంగా పెంచాలని భావిస్తోంది. క్రమంగా వీటిని ఎయిర్‌ఫోర్స్, నేవీలోనూ వినియోగించేందుకు అవకాశాలను పరిశీలిస్తోంది. అయితే వీటిని ఒక్కొక్కటిగా ప్రయోగిస్తే పెద్దగా ప్రయోజనం ఉండదు. ఒక్కో ప్లాటూన్‌లో కనీసం 10 డ్రోన్లు ఉంటాయి. దీనిని అశనీ దళంగా ఆర్మీ చెబుతోంది. వీటన్నింటినీ ఒకేసారి గుంపుగా ప్రయోగిస్తారు. వీటిలో కొన్ని నిఘా కోసం పని చేయగా.. మిగతా డ్రోన్లు శత్రు లక్ష్యాలను ఛేదిస్తాయి. పేలుడు పదార్థాలు మోసుకెళ్తున్న డ్రోన్లు.. శత్రు రాడార్లకు దొరక్కుండా నిఘా డ్రోన్లు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తాయి. సరైన అవకాశం లభించే వరకు వేచి చూసి దాడి చేయడం ఈ డ్రోన్ల ప్రత్యేకత. వీటి పని తీరును తెలుసుకునేందుకు అరుణాచల్ ప్రదేశ్‌లోని కమెంగ్ సెక్టార్‌లో సైన్యం ఇప్పటికే ప్రయోగాత్మకంగా పరిశీలించింది.

**ఆపరేషన్ సిందూర్ ప్రేరణగా..**

ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్.. క్షిపణులతో పాక్ భూభాగంపై విరుచుకుపడింది. పలు స్థావరాలను నేలమట్టం చేసింది. దాడికి పాల్పడినట్లు భావించిన 9 మంది ఉగ్రవాదుల్లో ఏడుగురిని ఒకే రోజు హతమార్చింది. భారత్‌ను అడ్డుకునే సత్తా లేని పాకిస్థాన్.. సామాన్యులే లక్ష్యంగా పెద్ద సంఖ్యలో డ్రోన్లను ప్రయోగించింది. వీటిని భారత్ సమర్థంగా అడ్డుకున్నప్పటికీ.. భవిష్యత్‌లో వాటి ముప్పును అధిగమించేందుకు వీలుగా డ్రోన్ శక్తిని గణనీయంగా పెంచుకుంటోంది.



## ఆ వార్తలు అవాస్తవం..

## బంగ్లా హైకమిషన్ వద్ద నిరసనలపై విదేశాంగ శాఖ

దిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ వెలుపల జరిగిన నిరసనల్లో ఎటువంటి భద్రతా లోపం తలెత్తలేదని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. దిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ బయట ఉన్న కంచెలను ఆందోళనకారులు ధ్వంసం చేసి, లోపలికి చొరబడడానికి ప్రయత్నాలు చేసినట్లు బంగ్లాదేశ్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తమని విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించేలా అక్కడి మీడియా అబద్ధపు ప్రచారాలు చేస్తోందన్నారు. బంగ్లా హైకమిషన్ వద్ద ఎవరూ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడలేదన్నారు. బంగ్లాదేశ్‌లో దీపూ చంద్ర దాస్ అనే మైనారిటీ యువకుడి హత్యకు వ్యతిరేకంగా శనివారం సాయంత్రం దిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ ముందు దాదాపు 2025 మంది యువకులు గుమిగూడి శాంతియుతంగా నినాదాలు చేసినట్లు రణధీర్ పేర్కొన్నారు. కొన్ని నిమిషాల తర్వాత అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది వారిని చెదరగొట్టారన్నారు. అయితే వారు అక్కడి నిబంధనలు ఉల్లంఘించడానికి, కంచెను దాటడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్య ఆధారాలు సోషల్ మీడియాలో అందరికీ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# 'వీబీ-జీ రామ్ జీ' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

దిల్లీ: 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' (వీబీజీ రామ్ జీ) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైనవారికి ఏడాదిలో 125 రోజుల పాటు పని కల్పించే ఉద్దేశంతో కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. గతంలో 100 రోజుల పని హామీ కల్పించిన మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) స్థానంలో దీనిని తీసుకొచ్చారు. ఇటీవల జరిగిన శీతాకాల సమావేశాల్లో విపక్షాల నిరసనల నడుమే ఈ బిల్లు ఉభయసభల ఆమోదం పొందింది. తగినంత సమయం ఇవ్వకుండా హడావుడిగా బిల్లులకు ఆమోదం తెలపడం అప్రజాస్వామికమంటూ విపక్షాలు ఉభయసభల్లోనూ నిరసన తెలిపాయి. రెండు దశాబ్దాలుగా అమల్లో ఉన్న 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ఎంజీనరేగా) చట్టాన్ని రద్దుచేయడం సరికాదంటూ ఆందోళన చేపట్టాయి. లోక్‌సభలో స్పీకర్ స్థానం వద్దకు వెళ్లి బిల్లు ప్రతుల్ని చించి విసిరేశాయి. రూ.10-11 లక్షల కోట్లను కేవలం కూలీలకిచ్చే వేతనాలపై ఖర్చుపెట్టడం కాకుండా శాశ్వత ఆస్తుల్ని సమకూర్చాలనే ఉద్దేశంతో, ఎంతో లోతుగా చర్చించాకే బిల్లు తయారుచేశామని కేంద్ర మంత్రి చౌహాన్ విపక్షాలకు వివరణ ఇచ్చారు.



## నెట్‌ఫ్లిక్స్‌లోకి వస్తోన్న ఆంధ్రా కింగ్ తాలూకా

**టాకీస్:** రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'.. తెలుగు సినీ అభిమాని కథగా నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమా విడుదలై నెల కూడా తిరక్కుండానే ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో డిసెంబర్ 25 నుంచి తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. విషయాన్ని తెలుపుతూ నెట్‌ఫ్లిక్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. మహేశ్‌బాబు.పి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సూర్య(ఉపేంద్ర) పేరుమోసిన సూపర్‌స్టార్. అశేషమైన అభిమానుల అతని సొంతం. అయితే.. తనకు బ్యాడ్ పిరియడ్ నడుస్తూ ఉంటుంది. విడుదలైన సినిమాలన్నీ ఎ÷-లాపులవుతుంటాయి. ఈ క్రమంలో సూర్య వందవ చిత్రం షూటింగ్ మధ్యలోనే ఆగిపోతుంది. చిత్రాన్ని నిర్మించలేనని నిర్మాత చేతులెత్తేస్తాడు. ఓ మూడు కోట్లు ఉంటే సినిమా పూర్తవుతుంది. ఆ మూడు కోట్ల కోసం సూర్య ప్రయత్నాలు మొదలుపెడతాడు. ఈ క్రమంలో ఓ నిర్మాతను డబ్బు అడుగుతాడు. అతను తన కొడుకు హీరోగా పరిచయం అవుతున్న సినిమాలో తండ్రి పాత్ర వేస్తే డబ్బు సర్దుతానంటాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా డబ్బు సమకూరకపోవడంతో చివరికి ఆ నిర్మాత పెట్టిన షరతుకి ఓకే చెప్పాలనుకుంటాడు. తన నిర్ణయాన్ని ఆ నిర్మాతకు చెప్పేలోపే సూర్య అకౌంట్‌లో మూడు కోట్లు పడతాయి. ఆ డబ్బు ఎవరు వేశారో సూర్యకు అర్థం కాదు. రాజమండ్రి దగ్గర్లోని ఓ పల్లెటూరి కుర్రాడు ఆ మూడు కోట్లు వేశాడని తెలిసి సూర్య షాక్ అవుతాడు. అతను తన అభిమాని తెలుసుకున్న సూర్య.. అతన్ని కలవాలని బయలు దేరతాడు? మరి సూర్య అభిమానిని కలిశాడా? ఓ పల్లెటూరి కుర్రాడికి ఈ మూడు కోట్లు ఎలా వచ్చాయి? అసలు ఆ కుర్రాడెవరు? అతని కథేంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ.

## ఆనాటి ఘటనలు తలచుకుంటేనే భయమేస్తోంది

### నటి రాధికా ఆప్టే సంచలన వ్యాఖ్యలు

టాకీస్: బాలీవుడ్‌తో పాటు సౌత్ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రాధికా ఆప్టే. సినీ రంగంలో తన ఇరవై ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న వివక్ష అలాగే బాడీ షేమింగ్ గురించి ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆ రోజులు గుర్తుకు వస్తే ఇప్పటికీ తన గుండె ఆగిపోయినంత పని అవుతుందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా 2000వ దశకం చివరలో ఆర్థిక ఇబ్బందుల వల్ల కొన్ని దక్షిణాది సినిమాల్లో నటించాల్సి వచ్చిందని, అప్పుడు షూటింగ్ సెట్స్‌పై ఉన్న పరిస్థితులు అత్యంత దారుణంగా ఉండేవని ఆమె పేర్కొన్నారు. ఒక చిన్న ఊరిలో జరిగిన షూటింగ్ సమయంలో సెట్ అంతా మగవారే ఉండేవారని, అక్కడ తన శరీరాకృతి గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసేవారని రాధిక వెల్లడించారు. సెట్‌లో ఉన్నవాళ్లు నా బమ్స్ మరియు బ్రెస్ట్స్ దగ్గర ప్యాడింగ్ పెంచమని అడిగేవారు. 'అమ్మా.. మోర్ ప్యాడింగ్' అని పిలిచేవారు. ఆ మాటలు విన్నప్పుడు తనకు నవ్వాలో ఏడవాలో అర్థమయ్యేది కాదని రాధికా వాపోయింది. అప్పట్లో తనకు రక్షణగా మేనేజర్లు, ఏజెంట్లు ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా ఆ మానసిక వేదనను అనుభవించానని, ఆ పరిస్థితులు తనను ఇప్పటికీ మానసిక గాయానికి గురిచేస్తాయని ఆవేదన చెందారు. హిందీ పరిశ్రమలో కూడా కొందరు ప్రభావవంతమైన వ్యక్తుల ప్రవర్తన నచ్చక తానంతట తానే పెద్ద ప్రాజెక్టుల నుంచి తప్పుకున్నానని, ఒకవేళ వారి పేర్లు బయటపెడితే ప్రపంచమంతా షాక్ అవుతుందని ఆమె తెలిపింది. పరిశ్రమలో ఉన్నత స్థాయిలో ఉన్న మహిళలు కూడా వ్యవస్థను మార్చడానికి ప్రయత్నించకపోవడం విచారకరమని అభిప్రాయపడిన రాధికా ఆప్టే, ప్రస్తుతం తన తాజా చిత్రం 'సాలీ మొహబ్బత్' జీ5లో స్ట్రీమ్ అవుతున్న సందర్భంగా ఈ విషయాలను పంచుకుంది.



## సామాజిక సందేశంతో వస్తోన్న దండోరా

**టాకీస్:** గ్రామీణ నేపథ్యంలో సాగే సందేశాత్మక చిత్రాలకు తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారన్న విషయం తెలిసిందే. తాజాగా అదే కోవలో తెలంగాణ సంస్కృతి, సామాజిక అంశాల కలబోతగా వస్తున్న చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నైజాం ఏరియాలో విడుదల చేస్తుండటం సినిమాపై మరింత అంచనాలను పెంచింది. విదేశాల్లో కూడా ఈ సినిమా భారీ ఎత్తున విడుదల కానుంది. సుమారు 200కు పైగా థియేటర్లలో ప్రదర్శితం కాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి, ఈ నెల 23నే అక్కడ ప్రీమియర్స్




పడనున్నాయి. అయితే ఈ సినిమా విడుదలకు ఇంకా వారం కూడా లేకపోవడంతో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.

గ్రామాల్లో ఇంకా కులం అడ్డుగోడలు తొలగిపోలేదని ఈ ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతుంది. ప్రారంభంలోనే ఊరి బయట శవాన్ని మోసుకెళ్తున్న దృశ్యాలు, 'మన చావు పుట్టుకలన్నీ ఈ ఊరి బయట రాసిండ్రా ఆ దేవుడు..' అనే డైలాగ్ ఈ సినిమాలో ఉన్న సామాజిక కోణాన్ని ఎత్తి చూపుతోంది. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మానికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందుమాధవి, రాధ్య, అదితి భావరాజు వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు.

## వెన్నులో వణుకు పుట్టించేలా ఈషా

టాకీస్: త్రిగున్, హెబ్బాపటేల్ కీలక పాత్రల్లో రానున్న హారర్ థిల్లర్ 'ఈషా'. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. ఆ హారర్ థ్రిల్లర్ డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో విడుదలకు మందు ఆసక్తికరమైన వీడియోను టీమ్ పంచుకుంది. ఆత్మ అంటే అదేనేమో అంటూ హీరోయిన్ చెప్పే డైలాగు భయపెట్టేలా ఉంది. ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' వంటి వరుస కల్ట్ హిట్స్ అందించిన సక్సెస్‌ఫుల్ జోడీ బన్నీ వాస్, వంశీ నందిపాటి. కలిసి ఇప్పుడు ప్రేక్షకులకు ఒక క్రేజీ హారర్ అనుభూతిని పంచడానికి సిద్ధమయ్యారు. వీరి సరికొత్త హారర్ థ్రిల్లర్ 'ఈషా' డిసెంబర్ 25న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ చిత్రం గురించి మేకర్స్ తాజాగా 'వార్నింగ్ వీడియో' పేరిట ఒక ఆసక్తికరమైన వీడియోను విడుదల చేశారు. సాధారణంగా హారర్ సినిమాలకు ట్రైలర్లు రావడం సహజం, కానీ ఇలా ప్రత్యేకంగా హెచ్చరిక వీడియో రావడం హారర్ జానర్‌లోనే ఇదే తొలిసారి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఆత్మలు, దెయ్యాలు లేవని బలంగా నమ్మే కొందరు స్నేహితుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సమాజంలోని మూఢనమ్మకాలను, దొంగ బాబాలను ఎండగట్టాలని వారు భావిస్తారు. ఈ క్రమంలో వారికి పృథ్వీరాజ్ (బబ్లూ) నుంచి ఒక సవాలు ఎదురవుతుంది. 'ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే..?' అంటూ ఆయన విసిరే ఛాలెంజ్‌తో ఈ స్నేహితుల బృందం ఒక చీకటి ప్రపంచంలోకి అడుగుపెడుతుంది. మనుషుల్లాగే కొన్ని స్థలాలు కూడా పుట్టుకతోనే శాపగ్రస్తమై ఉంటాయి.. కాలక్రమేణా అవి ఆత్మలకు నిలయాలుగా మారుతాయని దర్శకుడు శ్రీనివాస్ మన్నె ఇచ్చిన వార్నింగ్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. ట్రైలర్ మరియు ఈ వార్నింగ్ వీడియోలో కనిపించిన విజువల్స్ భయానకంగా ఉన్నాయి. ముఖ్యంగా పాడుబడిన బంగ్లా, క్షుద్ర పూజల సెటప్, బ్లూ అండ్ డార్క్ థీమ్ విజువల్స్ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి.సంతోష్ లైటింగ్, ధృవన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాలోని భయాన్ని రెట్టింపు చేస్తున్నాయి. ఈ చిత్రంలో ఉండే సడన్ ట్విస్ట్‌లు చూసి భయపడే అవకాశం ఉన్నందున, గుండె బలహీనంగా ఉన్నవారు ఈ సినిమా చూడకూడదని చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇందులో త్రిగున్, అఖిల్ రాజ్ హీరోలుగా నటించగా, హెబ్బా పటేల్ హీరోయిన్‌గా నటించింది.



**టాకీస్:** నేచురల్ స్టార్ నాని, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి ఒక షాకింగ్ అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో 'బర్నింగ్ స్టార్' సంపూర్ణేష్ బాబును ఒక సరికొత్త ఊర మాస్ అవతారంలో శ్రీకాంత్ ఓదెల చూపించబోతున్నాడు. ఎప్పుడూ తనదైన కామెడీతో నవ్వించే సంపూర్ణేష్ బాబును దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పూర్తిగా మార్చేశాడు. 'ది ప్యారడైజ్' చిత్రంలో సంపూ 'బిర్యానీ' అనే మాస్ పాత్రను పోషిస్తున్నారు. శుక్రవారం విడుదలైన ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పోస్టర్‌లో సంపూర్ణేష్ బాబు ఒంటి నిండా రక్తపు మరకలతో, భుజాన గొడ్డలి వేసుకుని, బీడీ తాగుతూ చాలా సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లలో కనిపిస్తున్న క్రూరత్వం చూస్తుంటే, ఇందులో ఆయన కేవలం కామెడీకి పరిమితం కాకుండా ఒక పవర్‌ఫుల్ పాత్ర చేస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ చిత్రంలో హీరో నాని (జడల్) కి అత్యంత సన్నిహితుడైన స్నేహితుడిగా, ప్రాణమిచ్చే నమ్మకస్థుడిగా 'బిర్యానీ' పాత్ర ఉండబోతోంది. ఈ పాత్ర కోసం సంపూర్ణేష్ బాబు చాలా బరువు తగ్గి, తన బాడీ

## బిర్యానీ పాత్రలో సంపూర్ణేశ్ బాబు



లాంగ్వేజ్‌ను కూడా పూర్తిగా మార్చుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన సినిమాల్లో పాత్రలను చాలా సహజంగా, గంభీరంగా చూపిస్తారు. 'దసరా'లో కమెడియన్లను కూడా సీరియస్ పాత్రల్లో చూపించినట్లుగానే, ఇప్పుడు సంపూ లోని యాక్షన్ యాంగిల్‌ను బయటకు తీయబోతున్నారు. 'హైదరాబాద్ నేపథ్యంలో సాగే కథలో 'బిర్యానీ' లేకుండా ఉండదు' అంటూ ఈ పాత్రను ఇంట్రడ్యూస్ చేసిన తీరు వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో నానితో పాటు, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ఈ సినిమా 2026 మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో (తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్) గ్రాండ్‌గా విడుదల కానుంది.

## ఈ నెల 26 నుంచి పరిహారం..

**ఇండిగో కీలక ప్రకటన**

**విమానాల రద్దుతో ఇబ్బందిపడ్డ ప్రయాణికులకు ఇండిగో పరిహారం**

**అదనంగా రూ.10,000 ట్రావెల్ వోచర్**

**ఈ నెల 26 నుంచి పరిహారం చెల్లింపులు ప్రారంభం**

**పరిహారం ప్రక్రియను పర్యవేక్షించనున్న కేంద్ర విమానయాన శాఖ**




**న్యూఢిల్లీ:** ఇటీవల విమానాలను భారీగా రద్దు చేసి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఇండిగో ఎయిర్‌లైన్స్, వారికి పరిహారం చెల్లించేందుకు ముందుకొచ్చింది. ఈ నెల 3, 4, 5 తేదీల్లో విమానాశ్రయాల్లో గంటల తరబడి చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఈ నెల 26 నుంచి రూ.10,000 విలువైన ట్రావెల్ వోచర్లను జారీ చేయనుంది.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన రూ.5,000 నుంచి రూ.10,000 పరిహారానికి ఇది అదనం. విమానయాన శాఖ కార్యదర్శి సమీర్ సిన్హా అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అర్హులైన ప్రయాణికులందరికీ తక్షణమే చెల్లింపులు జరిగేలా చూడాలని ఇండిగోను ప్రభుత్వం ఆదేశించింది.

నేరుగా ఇండిగో వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకున్న వారికి వారం రోజుల్లోగా చెల్లింపులు ప్రారంభించాలని సమావేశంలో నిర్ణయించారు. ట్రావెల్ ఏజెంట్లు, ఆన్‌లైన్ పోర్టల్ల నుంచి ప్రయాణికుల వివరాలు సేకరించి, వారికి కూడా నేరుగా పరిహారం అందించాలని ఇండిగోకు సూచించారు. ఈ ప్రక్రియను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఎయిర్ సేవా పోర్టల్ ద్వారా విమానయాన శాఖ పర్యవేక్షించనుంది.

రద్దయిన విమానాలకు సంబంధించి ఇండిగో రిఫండ్లు ప్రారంభించినప్పటికీ, ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెన్సీల ద్వారా బుక్ చేసుకున్న చాలా మందికి ఇంకా డబ్బులు అందలేదని తెలుస్తోంది. డీజీసీఏ ఆదేశాలతో మేక్ మై ట్రిప్ సంస్థ ఇండిగో నుంచి డబ్బులు రాకముందే దాదాపు రూ.10 కోట్లు రిఫండ్ చేసినట్లు సమాచారం. మరోవైపు భవిష్యత్తులో ఇలాంటి భారీ వైఫల్యాలు పునరావృతం కాకుండా సమస్య మూలాలను గుర్తించడానికి బయటి సాంకేతిక నిపుణులతో కలిసి పనిచేస్తామని ఇండిగో ఛైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా తెలిపారు.

ఈ నెల 8 నుంచి తమ నెట్‌వర్క్‌లోని అన్ని గమ్యస్థానాలకు విమాన సేవలు పూర్తిగా పునరుద్ధరించామని, 9 నుంచి కార్యకలాపాలు సాధారణ స్థితికి వచ్చాయని కంపెనీ పేర్కొంది.


## స్టార్‌బక్స్ సీటీఓగా భారత సీనియర్ టెకీ




**న్యూఢిల్లీ:** ప్రముఖ కాఫీ దిగ్గజ సంస్థ స్టార్‌బక్స్ తమ కంపెనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా భారతీయ సీనియర్ టెకీ ఆనంద్ వరదరాజన్‌ను నియమించింది. కస్టమర్లకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు స్టార్‌బక్స్‌లో సాంకేతికతను పెంచాలనే సీఈవో బ్రియాన్ నికోల్ ప్రయత్నాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

సీటీఓగా డెబ్ హాల్ లెఫెవ్రే సెప్టెంబరులో పదవీవిరమణ చేశారు. ఆయన స్థానంలోకి తాజాగా ఆనంద్ వచ్చారు. కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు, సీటీఓగా ఆనంద్ విధులు నిర్వహించనున్నట్లు సీఈవో బ్రియాన్ ప్రకటించారు. ఆనంద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేశారు. ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఆనంద్ వరదరాజన్ తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత 19 ఏళ్ల పాటు అమెజాన్‌లో విధులు నిర్వర్తించారు. ఒరాకిల్‌తో సహా పలు స్టార్టప్ కంపెనీల్లో కూడా పనిచేశారు.

## ఘోస్ట్ పెయిరింగ్.. వాట్సప్‌లో ఈ మెసేజ్ వచ్చిందా?



**న్యూఢిల్లీ:** ఈ టెక్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త పంథాలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో వాట్సప్ యూజర్లే లక్ష్యంగా కొత్త తరహా మోసం ఒకటి వెలుగులోకి వచ్చింది. డివైజ్ లింకింగ్ ఫీచర్‌ను దుర్వినియోగం చేసి, యూజర్ ఖాతాల్లోకి చొరబడుతున్నారు. దీనిని టెక్ నిపుణులు ఘోస్ట్ పెయిరింగ్ అని పిలుస్తున్నారు. పాస్‌వర్డ్స్, వెరిఫికేషన్ కోడ్స్, సిమ్ కార్డ్స్ వివరాలు చోరీ చేయాల్సిన పని లేకుండానే స్కామర్లు తమ పని కానిస్తున్నారని హెచ్చరించారు.

ఈ ఘోస్ట్ పెయిరింగ్‌లో సోషల్ ఇంజినీరింగ్‌ది కీలక పాత్ర. దానిద్వారా యూజర్ వాట్సప్.. మోసపూరిత డివైజ్‌తో అనుసంధానం అయ్యేలా స్కామర్లు బురిడీ కొట్టిస్తుంటారు . ఈ మోసాన్ని గుర్తించడం కష్టం. మనకు తెలిసిన కాంటాక్ట్‌ల నుంచి వంటి సందేశంతో ఈ స్కామ్ మొదలవుతుంది. సందేశంలో అంతర్లీనంగా లింక్ ఉంటుంది. ఆ తర్వాత ఫేస్‌బుక్ ఫొటో వ్యూయర్ తలపించే నకిలీ వెబ్‌పేజ్ డిస్‌ప్లే అవుతుంది. అందులోని కంటెంట్ చూడాలంటే తొలుత వెరిఫై చేయాల్సి ఉంటుంది. మనకు పైకి ఇలా కనిపిస్తున్నా.. అంతర్లీనంగా డివైజ్ పెయిరింగ్ ప్రక్రియ మొదలవుతుంది. అప్పుడే ఫోన్ నంబర్ ఎంటర్ చేయాలని యూజర్‌కు రిక్వెస్ట్ వస్తుంది.

### మీ ఖాతా ఎవరు వాడుతున్నారు?

దాని తర్వాత న్యూమరిక్ పెయిరింగ్ కోడ్‌ను వాట్సప్ జనరేట్ చేస్తుంది. ఈ కోడ్‌ను వాట్సప్ లో ఎంటర్ చేయాలని నకిలీ పేజ్‌లో ఒక సూచన కనిపిస్తుంది. ఇదంతా భద్రతా తనిఖీల్లో భాగమని పేర్కొంటుంది. ఇక ఈ కోడ్‌ను ఎంటర్ చేయగానే మనకు తెలియకుండానే స్కామర్ డివైజ్‌తో అనుసంధానం అవుతాం. దీంతో వాట్సప్ వెబ్ యాక్సెస్ మొత్తం హ్యాకర్ చేతిలోకి వెళ్లిపోతుంది. బాధితుడి మెసేజ్‌లు అన్ని చదివేస్తాడు. యూజర్ పంపినట్టుగా ఇతరులకు సందేశాలు పంపుతాడు. ఈ ఉల్లంఘన అంతా తెలియకుండానే జరిగిపోతుంటుంది.

ఈ ఘోస్ట్ పెయిరింగ్‌ను తొలుత చెక్ రిపబ్లిక్‌లో గుర్తించారు. ఇది ఇక్కడితో ఆగకపోవచ్చని నిపుణులు హెచ్చరించారు. ఇప్పటికే హ్యాకర్ల చేతిలో చిక్కిన ఖాతాలను ఉపయోగించి, కాంటాక్ట్‌లు, గ్రూప్ చాట్‌లకు ఆ మోసపూరిత లింక్‌లను పంపే అవకాశం ఉందని పేర్కొన్నారు. లింక్డ్ డివైజ్‌ను యూజర్ మాన్యువల్‌గా తొలగించేవరకు అది యాక్టివ్‌గానే ఉంటుంది. యూజర్ దానిని గుర్తించేవరకు ఉల్లంఘనకు గురవుతూనే ఉంటారు. ఘోస్ట్ పెయిరింగ్ వంటి కేసుల్లో సాఫ్ట్‌వేర్ లోపాల కంటే మనుషుల విశ్వాసం, భయం, అవసరం వంటి మానసిక ప్రవర్తనను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడతారని నిపుణులు హెచ్చరించారు. ఇందుకోసం మనుషుల ప్రవర్తనను స్కామర్లు అర్థం చేసుకుంటారు. దానిద్వారా యూజర్ రహస్య సమాచారాన్ని బహిర్గతం చేసేలా మభ్యపెడతారు. దీనినే సోషల్ ఇంజినీరింగ్‌గా చెప్తారు.




# టీ20 ప్రపంచకప్‌కు జట్టును ప్రకటించిన బీసీసీఐ..!

**ఐసీసీ ఈవెంట్ నుంచి శుభ్‌మన్ గిల్ అవుట్..!**

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది భారత్-శ్రీలంక వేదికగా జరుగనున్న టీ20 ప్రపంచకప్‌లో సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని టీమిండియా డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో దిగనున్నది. ఈ సారి టైటిల్‌ను నిలబెట్టుకోవాలని భారత జట్టు భావిస్తున్నది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని జాతీయ సెలక్షన్ కమిటీ శనివారం టీ20 ప్రపంచ టోర్నమెంట్ కోసం 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రధాన కార్యాలయంలో జరిగిన సెలక్షన్ కమిటీ సమావేశంలో జట్టును ఎంపిక చేసింది. ఇదే జట్టు జనవరిలో న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌లో కూడా ఆడనుంది.

రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత్ 2024లో దక్షిణాఫ్రికాను ఓడించి ట్రోఫీని గెలుచుకుంది. భారత్ తన టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే సంకల్పంతో ఈ టోర్నమెంట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నది. ఈ ఇది టోర్నమెంట్ 10వ ఎడిషన్. ఈ టోర్నమెంట్‌లో ఇప్పటి వరకు ఏ జట్టు కూడా టైటిల్‌ను నిలబెట్టుకోలేకపోయాయి. సొంత గడ్డపై ఈ రికార్డును బద్దలు కొట్టాలని టీమిండియా కృతనిశ్చయంతో ఉన్నది. టీ20 ప్రపంచ కప్ కోసం భారత జట్టులో శుభ్‌మన్ గిల్ దూరమయ్యాడు. మొన్నటి వరకు వైస్ కెప్టెన్‌గా కొనసాగిన గిల్ స్థానంలో అక్షర్ పటేల్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ఫామ్ లేమితో గిల్ ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే.

ఇదిలా ఉండగా.. వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్, రింకు సింగ్ జట్టులోకి తిరిగి వచ్చారు. ఇషాన్ చివరిగా 2023 నవంబర్ 28న ఆస్ట్రేలియాపై భారత్ తరఫున చివరి మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత ఇషాన్ దక్షిణాఫ్రికా పర్యటనకు ఎంపికయ్యాడు. కానీ అక్కడ ఒక్క మ్యాచ్ కూడా ఆడే ఛాన్స్ రాలేదు. పర్యటన మధ్యలోనే ఇషాన్ తిరిగి స్వదేశానికి వచ్చాడు. దేశవాళీ క్రికెట్ కంటే ఐపీఎల్‌కు ప్రాధాన్యత ఇస్తున్నాడన్న విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే జాతీయ జట్టులో చోటు కోల్పోయాడు. తాజాగా రెండేళ్ల తర్వాత జట్టులోకి తిరిగి వచ్చాడు. రింకు సింగ్ చివరిసారిగా ఆసియా కప్‌లో ఆడాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో మాత్రం చోటు దక్కలేదు. శుభ్‌మన్ గిల్ స్థానంలో అక్షర్ పటేల్‌ను టీ20 జట్టు వైస్ కెప్టెన్‌గా నియమించారు. అక్షర్ గతంలో కూడా టీ20ల్లో వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు.

వాస్తవానికి ఈ సారి ఎవరూ ఊహించని విధంగా ఇషాన్ కిషన్ జట్టులోకి తిరిగి వచ్చాడు. కిషన్ ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఫైనల్‌లో 101 పరుగులు చేశాడు. టోర్నమెంట్ మొత్తం అద్భుతమైన బ్యాటింగ్‌తో అలరించాడు. ఇషాన్ చేరికతో జితేష్ శర్మ చోటు కోల్పోయాడు. సంజు శాంసన్ వికెట్ కీపర్‌గా వ్యవహరిస్తాడు. జట్టును ప్రకటించే సమయంలో అజిత్ అగార్కర్ మాట్లాడుతూ సంజు శాంసన్ వికెట్ కీపర్‌గా కొనసాగుతాడని తెలిపాడు. గిల్ జట్టులో లేకపోవడంతో అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. శాంసన్, అభిషేక్ ఓపెనింగ్ జోడీ అద్భుతంగా ఉంటుంది. గతంలో ఇద్దరు ఓపెనర్లుగా వచ్చి పరుగుల వరద పారించారు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదవ టీ20లోనూ ఇదే దృశ్యం కనిపించింది.

ఈ ఏడాది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు టీ20 ప్రపంచకప్ జరుగనున్నది. భారత్-శ్రీలంక సంయుక్తంగా టీ20 ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇస్తున్నాయి. ఇప్పటికే ఐసీసీ వేదికలను ఖరారు చేసిన విషయం తెలిసిందే. టీమిండియా టీ20 ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న ముంబయిలో యూఎస్‌ఏతో ఆడుతుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 12న నమీబియాతో ఢిల్లీలో ఆడుతుంది. ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో పాకిస్తాన్‌తో మ్యాచ్ ఆడుతుంది. అనంతరం ఫిబ్రవరి 18న అహ్మదాబాద్‌లోని భారీ నరేంద్ర మోదీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో చివరి గ్రూప్ మ్యాచ్ ఆడుతుంది.

### టీ20 ప్రపంచకప్ కోసం భారత జట్టు

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), రింకూ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, ఇషాన్ కిషన్, వరుణ్ చక్రవర్తి.

## అడిలైడ్‌లో తిప్పేసిన లియాన్.. ఇంగ్లండ్ బ్యాటర్లు అద్భుతం చేస్తారా..!

**అడిలైడ్:** యాషెస్ సిరీస్ సమం చేయాలనుకున్న ఇంగ్లండ్ ఇక ఆశలు వదులుకోవాల్సిందే. రెండు టెస్టుల్లో ఆస్ట్రేలియాకు కనీసం పోటీ ఇవ్వలేకపోయిన ఇంగ్లిష్ టీమ్.. అడిలైడ్‌లోనూ అదే తడబాటుతో ఓటమి అంచున నిలిచింది. ట్రావిస్ హెడ్(170) భారీ శతకంతో పుంజుకున్న ఆసీస్ నాలుగో రోజు కమిన్స్(3-24), నాథన్ లియాన్(3-64)ల విజృంభణతో గెలుపు దిశగా సాగుతోంది. వీరిద్దరి ధాటికి ఇంగ్లండ్ టాపార్డర్ కుప్పకూలగా.. జేమీ స్మిత్(2 నాటౌట్), విల్ జాక్స్(11 నాటౌట్) పోరాడుతున్నారు. ఆఖరి సెషన్‌లో వీరిద్దరూ పట్టుదలగా ఆడడంతో ఆట ముగిసే సరికి 6 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసింది.

ఆస్ట్రేలియా గడ్డపై యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ మరో ఓటమికి చేరువలో ఉంది. ఇప్పటికే పెర్త్, బ్రిస్బేన్‌లో కంగుతిన్న పర్యాటక జట్టు చావోరేవో పోరులోనూ ఎదురీదుతోంది. అడిలైడ్ టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో జాక్ క్రాలే(85) అర్ధ శతకంతో ఆశలు రేపినా.. కమిన్స్ (3-24), నాథన్ లియాన్(3-64) వికెట్ల వేటకు టాపార్డర్ కుప్పకూలింది. కమిన్స్ ఓవర్లో జో రూట్(39), లియన్ దెబ్బకు హ్యారీ బ్రూక్(30)లు తేలిపోయారు. స్వల్ప తేడాతో బ్రూక్‌ను, బెన్‌స్టోక్స్(5)ను బౌల్డ్ చేసిన లియాన్ ఇంగ్లండ్‌ను విజయావకాశాల్ని దెబ్బతీశాడు.

అర్ధ శతకంతో పోరాడిన క్రాలేను ఔట్ చేసి ఇంగ్లండ్‌ను ఓటమి అంచున నిలిపాడు లియాన్.



ఆఖరి సెషన్‌లో జేమీ స్మిత్(2 నాటౌట్), విల్ జాక్స్(11 నాటౌట్)లు వికెట్ కాపాడుకోవడంతో ఆట ముగిసే సరికి 6 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. యాషెస్ సిరీస్ సమం చేయాలంటే ఇంగ్లండ్ విజయానికి 228 రన్స్ అవసరం. కానీ, చివరి రోజు వీరిద్దరూ సెంచరీలు సాధిస్తే తప్ప గెలుపు అసాధ్యం. ఒకవేళ తొలి సెషన్‌లోనే ఔటయ్యారంటే.. టెయిలెండర్లను కమిన్స్, లియాన్ చుట్టేయడం పక్కా. తొలి ఇన్నింగ్స్‌లో జోఫ్రా ఆర్చర్(5-53) చెలరేగగా ఆసీస్‌ను 371కే కట్టడి చేసిన ఇంగ్లండ్ బ్యాటర్ల వైఫల్యంతో మ్యాచ్‌పై పట్టు సాధించలేకపోయింది.

## సూర్యకుమార్‌కు మద్దతు ప్రకటించిన తిలక్ వర్మ..

**ఫామ్‌లోకి వచ్చేందుకు ఒక ఇన్నింగ్స్ సరిపోతుందన్న బ్యాట్స్‌మెన్..!**

**న్యూఢిల్లీ:** టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పేలవ ఫామ్‌తో పరుగులు చేసేందుకు ఇబ్బందిపడుతున్నాడు. దాంతో టీమిండియా కెప్టెన్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే, సూర్యకు టీమిండియా యువ ఆటగాడు తిలక్ వర్మ మద్దతు ప్రకటించాడు. తిరిగి ఫామ్‌లోకి వచ్చేందుకు కెప్టెన్‌కు కేవలం ఒకే ఇన్నింగ్ సరిపోతుందని తెలిపాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో సూర్య భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. వచ్చే ఏడాదిలో టీ20 ప్రపంచకప్ జరుగనున్నది. మెగా ఈవెంట్‌కు ముందు కెప్టెన్ ఫామ్‌లో లేకపోవడంతో ఆందోళనకు గురి చేస్తున్నది. సూర్యకుమార్ చాలాకాలంగా పరుగులు చేయలేకపోతున్నాడు. భారత జట్టు దక్షిణాఫ్రికాను 3-1 తేడాతో ఓడించి సిరీస్‌ను కైవసం చేసుకుంది.

టీ20 ప్రపంచ కప్ కోసం భారత జట్టును కూడా శనివారం బీసీసీఐ ప్రకటించనున్నది. సౌతాఫ్రికాతో జరిగిన చివరి టీ20 అనంతరం సూర్య కుమార్ గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ.. కొన్ని బంతులను



సౌకర్యవంతంగా ఆడాలని సూర్యకు సూచించినట్లు తెలిపాడు. కొద్దిగా వేచి ఉండాలని.. అతను క్రీజులో కొంత వరకు సమయం గడపాలన్న తిలక్.. సూర్యకుమార్ తిరిగి ఆత్మవిశ్వాసంతో ఆడితే ఎంత ప్రమాదకరమైన ఆటగాడో అందరికీ తెలిసిందేనన్నాడు. బ్యాటింగ్ సమయంలో కొన్ని బంతులను ఎదుర్కొంటే ఫీల్డర్ల మీదుగా కొన్ని షాట్లు కొట్టేందుకు ప్రయత్నించాలని చెప్పానని.. గ్యాప్స్‌లో ఆడేందుకు ప్రయత్నించాలని సూచించినట్లు చెప్పాడు. ఎవరైనా బ్యాట్స్‌మెన్ అలా చేయగలిగితో వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని.. ఫీల్డ్ గురించి అవగాహన వస్తుందని.. ఆ తర్వాత భారీ షాట్లు ఆడవచ్చని తిలక్ వర్మ చెప్పాడు.

# యూఎస్ కిడ్స్ గోల్ఫ్ టోర్నీలో సత్తా చాటిన భారత చిన్నారులు

**యూఎస్ కిడ్స్ గోల్ఫ్ ఇండియా ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన యువ గోల్ఫర్లు**


**నిహాల్ చీమా, ద్రోణ సింగ్, నాయ్యా సిన్హా అద్భుత ప్రదర్శన**

**విజేతలకు తొలిసారిగా నగదు బహుమతుల అందజేత**

**భవిష్యత్తులో ఆసియా ఛాంపియన్‌షిప్ నిర్వహణకు ప్రణాళికలు**

**న్యూఢిల్లీ:** క్లాసిక్ గోల్ఫ్ అండ్ కంట్రీ క్లబ్ వేదికగా జరిగిన ఐదవ యూఎస్ కిడ్స్ గోల్ఫ్ ఇండియన్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ గోల్ఫర్లు సత్తా చాటారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, పొగమంచు వంటి సవాళ్లను అధిగమించి నిహాల్ చీమా, ద్రోణ సింగ్ ధుల్, ప్రిన్స్ బెయిన్స్‌లా, నాయ్యా ఎస్ సిన్హా, గైరత్ కౌర్ కహ్లోన్, శిక్షా జైన్ వంటి క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచారు.

వాతావరణం అనుకూలించకపోవడం, ఆలస్యంగా ప్రారంభం కావడంతో టోర్నమెంట్ కమిటీ చివరి రౌండ్‌ను అన్ని విభాగాలకు 9 హెూల్స్‌కు కుదించింది. బాలుర 8 ఏళ్ల



విభాగంలో నిహాల్ చీమా మూడు రోజులూ అద్భుతంగా ఆడి తిరుగులేని విజయాన్ని అందుకున్నాడు. హర్యానాకు చెందిన ద్రోణ సింగ్ ధుల్ (బాలుర 11 ఏళ్ల విభాగం) చివరి రౌండ్‌లో 4-అండర్ 32 స్కోర్‌తో ఆకట్టుకున్నాడు. ప్రిన్స్ బెయిన్స్‌లా (బాలుర 15-18 ఏళ్ల విభాగం) తొలిరోజు 6-అండర్ 66 స్కోర్‌తో సత్తా చాటి విజేతగా నిలిచాడు.

బాలికల విభాగంలో ఆన్యా దండ్రియాల్ (11-12 ఏళ్లు) టై బ్రేకర్‌లో విజయం సాధించగా, నాయ్యా ఎస్ సిన్హా (8 ఏళ్లు), శిక్షా జైన్ (13-14 ఏళ్లు) తమ తమ విభాగాల్లో అద్భుత ప్రదర్శన చేశారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో తొలిసారిగా విజేతలకు నగదు బహుమతులు అందించారు. విజేతలకు రూ. 25,000, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన వారికి చెరో రూ. 10,000 అందజేశారు.

"పిల్లలను ఛాంపియన్‌లుగా తీర్చిదిద్దడానికి ఎంతో శ్రమించే క్రీడాకారులు, వారి కుటుంబాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నగదు బహుమతులు ప్రవేశపెట్టాం" అని యూఎస్ కిడ్స్ గోల్ఫ్ ఇండియా వ్యవస్థాపకుడు రాజేశ్ శ్రీవాస్తవ తెలిపారు. భవిష్యత్తులో విదేశీ కోచ్‌లను రప్పించడం, మన పిల్లలను శిక్షణ కోసం విదేశాలకు పంపడం వంటి ప్రణాళికలు ఉన్నాయని ఆయన వివరించారు. ఏడాదిలోగా ఆసియా దేశాలన్నింటికీ కలిపి ఒక ఏషియన్ ఛాంపియన్‌షిప్ నిర్వహించే యోచనలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు.


# ‘చీర’ సొగసు.. మారుతోంది!






**ఎన్ని ఫ్యాషన్లు పుట్టుకొచ్చినా చీరను మాత్రం రీప్లేస్ చేయలేవు. దాని సొగసు, అది కట్టుకుంటే వచ్చే అందం అలాంటిది మరి.. అన్నింటికంటే ముఖ్యంగా ఇది మన సంప్రదాయ వస్త్రధారణ కూడా! అయితే చీర ఎవర్‌గ్రీనే అయినా ఇందులో సరికొత్త ట్రెండ్స్ పుట్టుకురావడం ఏటా జరిగేదే! అలా ఈ ఏడాదీ కొన్ని శారీ ట్రెండ్స్ తమ హవా కొనసాగించాయి. సెలబ్రిటీలు మొదలు సామాన్య మహిళల దాకా.. ప్రతి ఒక్కరి వార్డ్‌రోబ్‌లో భాగమవుతూ వారి అందానికి వన్నెలద్దాయి. ‘ప్రపంచ చీర దినోత్సవం’ సందర్భంగా ఈ ఏడాది మగువల మనసు దోచిన కొన్ని శారీ ట్రెండ్స్ ఇవి!**














ఏ దుస్తులు ఎంచుకున్నా లైట్ వెయిట్‌గా, సౌకర్యంగా ఉండాలనుకుంటున్నారు ఈ తరం అమ్మాయిలు. చీరల విషయంలోనూ ఇదే ఫ్యాషన్ మంత్రా ఫాలో అవుతున్నారు. అందుకే ఈ ఏడాది లైట్ వెయిట్ శారీస్‌కి డిమాండ్ మరింతగా పెరిగిందంటున్నారు ఫ్యాషన్ నిపుణులు. ఇక రోజూ ఆఫీస్‌కి చీరకట్టులోనే వెళ్లాలనుకొనే మహిళల నుంచి పార్టీ వేర్ ఎంపికల దాకా.. దాదాపు చాలామంది తేలికపాటి చీరలకే ఓటేసినట్లు చెబుతున్నారు. అయితే ఇలా చీర లైట్‌వెయిట్‌గా, సింపుల్‌గా ఉన్నప్పటికీ బ్లౌజ్‌తో తమ లుక్‌ని హైలైట్ చేసుకున్న వారూ చాలామందే! ఈ క్రమంలోనే వెల్వెట్, మ్యాచింగ్ కలర్ ఫ్లోరల్, కాంట్రాస్ట్ కలర్ బ్లౌజులు.. ఇలా ఎవరి అభిరుచులకు తగినట్లుగా వారు ఎంచుకొని మెరిసిపోయారు. అంతేకాదు.. ఆయా సందర్భాలకు అనుగుణంగా సింపుల్, కాస్త హెవీ జ్యుయలరీతో తమ లుక్‌కి ఫినిషింగ్ టచ్ ఇస్తూ అదరగొట్టేశారు.

ప్రింట్ ఫ్యాషన్ ఈనాటిది కాదు. ప్రాచీన కాలం నుంచే ఇది మగువల మనసైన ఫ్యాషన్‌గా పేరు తెచ్చుకుంది. అయితే ఇందులోనూ యానిమల్, ఫ్లోరల్, జామెట్రిక్, స్ట్రైప్డ్.. వంటి విభిన్న ప్రింట్లతో రూపొందించిన దుస్తులు చాలామంది ప్రయత్నించే ఉంటారు. కాలానికి అనుగుణంగా ఫ్యాషన్ పోకడలు మారినట్టే.. ప్రింట్ ఫ్యాషన్‌లోనూ లేటెస్ట్ ట్రెండ్స్ అందుబాటులోకొస్తున్నాయి. అలా ఈ ఏడాది వాస్తవికతకు దగ్గరగా ఉండే ఫొటోరియలిస్టిక్ ఫ్లోరల్స్, అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్, మినిమలిస్ట్ డిజైన్స్, జామెట్రిక్ ప్యాటర్న్స్.. వంటివి ట్రెండింగ్‌లో నిలిచాయట! ఈ తరహా ప్రింట్లతో కూడిన ఫ్యాషనబుల్ శారీస్‌ని ఎంచుకోవడానికి మగువలు తెగ ముచ్చటపడ్డారట! చూడ్డానికి సింపుల్‌గా ఉన్నా, డీసెంట్ లుక్‌ని అందిస్తూనే.. సౌకర్యాన్నిచ్చే ఈ తరహా చీరలు ఎలాంటి అకేషన్‌కైనా ఇట్టే నప్పేయడమే ఇందుకు కారణమట!

ఈ బిజీ లైఫ్‌స్టైల్‌లో అటు ఆఫీస్‌కైనా, ఇటు పార్టీకైనా క్షణాల్లో రడీ అయిపోవాలనుకుంటున్నారు మహిళలు. అలాగని ఏదో ఒక డ్రస్ వేసుకొని వెళ్లామని రాజీ పడట్లేదు. అకేషన్ ఏదైనా చీరకట్టుకే ఓటేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రిస్టిచ్‌డ్/ప్రిడ్రేప్‌డ్ చీరలకు ఆదరణ పెరిగిపోయింది. గంటల తరబడి కట్టే అవసరం లేకుండా సులభంగా ధరించేలా ముస్తాబవుతోన్న ఈ చీరలు.. ఎవర్‌గ్రీన్ శారీస్‌గా ప్రస్తుతం ప్రతి మహిళ వార్డ్‌రోబ్‌లోనూ స్థానం సంపాదించాయి. ఈ ఏడాది కూడా చాలామంది ఈ తరహా చీరల్ని వివిధ అకేషన్స్ కోసం ఎంచుకున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ప్యాంట్ శారీస్, కేప్ డ్రేప్స్, రఫుల్డ్ స్టైల్.. వంటి విభిన్న ఫ్యాషనబుల్ ప్రీ-స్టిచ్డ్ శారీస్ మహిళల అందాన్ని ద్విగుణీకృతం చేశాయని చెప్పచ్చు. ఇక వీటినీ తమ అభిరుచులకు తగినట్లుగా హెవీ ఎంబ్రాయిడరీ, కోర్సెట్ తరహా బ్లౌజులతో జతచేస్తూ తమ స్టైల్ కోషెంట్‌ని పెంచేశారు ఫ్యాషన్ బ్యూటీస్.

### పూలోంకీ శారీ!

పెళ్లిలో ఆయా అకేషన్స్‌కి తగినట్లుగా విభిన్న అవుట్‌ఫిట్స్‌ని ఎంచుకోవడం మనకు అలవాటే! అందులోనూ వధువులతో పోటీ పడుతూ మరీ కొన్ని రకాల దుస్తుల్ని కస్టమైజ్ చేయించుకుంటున్నారు ఈతరం అమ్మాయిలు. హల్దీ, మెహెందీ, సంగీత్, బ్రైడల్ ఎంట్రీ కోసం కొందరు వధువులు పూలతో ప్రత్యేకంగా దుపట్టా, వెయిల్, అడ్డుతెర పూలోంకీ చాదర్.. వంటివి డిజైన్ చేయించుకోవడం మనం చూశాం. ఈ తరహాలోనే కొంతమంది పూలతో చీరల్ని కస్టమైజ్ చేయించుకొనీ ఆయా అకేషన్స్‌లో ధరించి మెరిసిపోతున్నారు. అలా ఈ ఏడాది పూలోంకీ శారీ వంటి ఫ్యాషన్లకు ఆదరణ పెరిగినట్లు నిపుణులు చెబుతున్నారు. ఇక మరికొందరు చీర రంగుకు మ్యాచయ్యేలా పల్లూ మాత్రమే ఆయా పూలతో కస్టమైజ్ చేయించుకుంటూ తమ ఫ్యాషన్ అభిరుచుల్ని చాటుకుంటున్నారు.


### ‘స్కాలోప్ బోర్డర్’ సొగసులు!

చీర సాధారణంగానే ఉన్నా.. బోర్డర్‌తో కొన్ని హైలైట్ అవుతుంటాయి. శారీకి హెవీ లుక్, రిచ్‌నెస్ తీసుకొస్తాయి. అలాంటి సొగసైన స్కాలోప్ బోర్డర్ శారీస్ ఈ ఏడాది సరికొత్త ట్రెండ్‌ని సృష్టించాయంటున్నారు నిపుణులు. బోర్డర్ అంచు డిజైన్లకు అనుగుణంగా ఎడ్జెస్‌ను కట్ చేస్తూ అందంగా తీర్చిదిద్దడమే దీని ప్రత్యేకత. ఇందులోనూ జరీ, ఎంబ్రాయిడరీ, సీక్విన్స్, లేస్, మిర్రర్ వర్క్.. ఇలా విభిన్న డిజైన్లతో కూడిన స్కాలోప్ బోర్డర్ చీరలు మగువల మనసు దోచుకున్నాయి. కొంతమంది ప్లెయిన్ శారీస్‌పైనా ఈ తరహా బోర్డర్‌ను జతచేయించుకొని, తమ అభిరుచులకు తగినట్లుగా కస్టమైజ్ చేయించుకొని ఫ్యాషన్ దివాలా మెరిసిపోయారు. మరికొందరు ఈ తరహా బ్లౌజుల్ని తమ చీరలకు మ్యాచ్ చేసి అదరగొట్టారు. ఇవే కాదు.. ఆర్గంజా, టిష్యూ సిల్క్, మెటాలిక్, ఫ్యూజన్.. వంటి చీరలూ ఈ ఏడాది చాలామంది అతివల వార్డ్‌రోబ్‌లో భాగమయ్యాయి. ఇక కొందరు పర్యావరణ ప్రియులు సస్టెయినబుల్ ఫ్యాషన్ పేరుతో.. రీసైక్లింగ్ చేసిన చీరలు, న్యాచురల్ డైలు అద్దిన శారీస్, సెమీసింథటిక్ ఫైబర్‌తో తయారుచేసిన టెన్సెల్ చీరకట్టులోనూ ఔరా అనిపించారు. ఇలా మొత్తానికి ఈ ఏడాది సింపుల్ అండ్ బ్యూటిఫుల్‌గా కనిపించే మినిమల్ శారీ ట్రెండే కొనసాగిందని చెప్పచ్చు.

# ఇంటి శుభ్రత విషయంలో..!



**ఇంట్లో పని ఎంత చేసినా ఓ పట్టాన తరగదు. ఇక వృత్తి ఉద్యోగాలు చేసే మహిళలకు రోజువారీ పనులు మినహాయిస్తే ఇంటి శుభ్రత, గృహోపకరణాల్ని శుభ్రం చేయడం.. వంటి అదనపు పనులకు సమయం కేటాయించడం కుదరనే కుదరదు. దానివల్ల ఇంట్లో దుమ్ము పేరుకుపోతుంది.. గృహోపకరణాల పనితీరు దెబ్బతింటుంది. ఫలితంగా పని మరింతగా పెరుగుతుంది. మరి, అలా జరగకుండా ఉండాలంటే ఇంటి శుభ్రత విషయంలో కొన్ని పొరపాట్లు జరగకుండా చూసుకోవాలంటున్నారు నిపుణులు.**



### శుభ్రపరిచేవైనా సరే..!

ప్రస్తుతం ప్రతి ఇంట్లో వాషింగ్ మెషీన్లు, డిష్‌వాషర్లు కామనైపోయాయి. అయితే బట్టలు, గిన్నెల్ని శుభ్రం చేసే ఈ గృహోపకరణాల్ని ప్రత్యేకించి శుభ్రం చేయాల్సిన అవసరం లేదనుకుంటారు కొందరు. అయితే వీటిని కూడా మధ్యమధ్యలో క్లీన్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆయా మెషీన్లను ఎలా శుభ్రం చేయచ్చో సంబంధిత మాన్యువల్ చూసి ఫాలో అవ్వాలి.

### మురికివే వాడుతున్నారా?

వివిధ రకాల గృహోపకరణాలు, ఇతర వస్తువుల్ని మైక్రోఫైబర్ క్లాత్ లేదంటే కాటన్ క్లాత్‌తో శుభ్రం చేయడం మనకు అలవాటే! అయితే పని పూర్తయ్యే సరికి అవి మురికిగా తయారవుతాయి. వాటిని సాధారణ డిటర్జెంట్‌తో ఉతికి ఆరేసి తిరిగి వాడుకోవడం చాలామంది చేసే పని. అయితే ఇలా పైపైన ఉతకడం వల్ల అవి పూర్తిగా శుభ్రపడవు.. సరికదా.. వాటిపై బ్యాక్టీరియా వృద్ధి చెందే ప్రమాదమూ లేకపోలేదు. అలాగే వాటి నుంచి అదో రకమైన వాసన కూడా వస్తుంటుంది. అందుకే అలాంటి మురికి క్లాత్స్/టవల్స్‌ని ప్రత్యేకంగా శుభ్రం చేయాల్సి ఉంటుంది. వేడి నీళ్లలో టేబుల్‌స్పూన్ వెనిగర్ వేసి ఈ క్లాత్స్‌ని అరగంట పాటు నానబెట్టి.. ఆ తర్వాత ఉతికి ఎండలో ఆరేయాలి. ఇలా ఉతికితే అవి శుభ్రపడడంతో పాటు వాటిపై ఉన్న మరకలు కూడా తొలగిపోతాయి. ఆపై తిరిగి వీటిని ఉపయోగించుకోవచ్చు.

### వాయిదాల పర్వం వద్దు!

సమయం లేకో, బద్ధకించో.. ఏదైనా పనిని తర్వాత చేద్దాంలే అని అలాగే వదిలేస్తే.. ఆ తర్వాత మరింత శ్రమ పడాలి.. సమయం కూడా వృథా. అందుకే ఇంటి శుభ్రత విషయంలో వాయిదాల పర్వం వద్దే వద్దంటున్నారు నిపుణులు. ఓ అరగంట అటో, ఇటో.. శుభ్రం చేయాలనుకున్న వస్తువును అప్పటికప్పుడే క్లీన్ చేసేసుకోవడం మంచిది. అలాగే అన్ని పనులు ఒకేసారి పెట్టుకున్నా భారమవుతుంది. కాబట్టి ఒక రోజు ఒక వస్తువు శుభ్రం చేస్తే.. మరో రోజు మరో ర్యాక్ శుభ్రం చేయండి. పని సులువవుతుంది.

వీటితో పాటు ఇంటి పని సులభంగా పూర్తవ్వాలన్నా, అదనపు భారం పడకుండా ఉండాలన్నా.. మీ వారిని/ఇతర కుటుంబ సభ్యులను/పిల్లల్ని ఆయా పనుల్లో భాగం చేయాలి. వారికీ కొన్ని పనులు అప్పగించాలి. ఫలితంగా ఇల్లూ నీట్‌గా ఉంటుంది.. శ్రమా తగ్గుతుంది.. అలాగే ఇప్పుడు ఎన్నో రకాల యాప్స్.. ఇంటితో పాటు వివిధ గృహోపకరణాల్ని సైతం శుభ్రం చేసిపెట్టే సేవల్ని అందిస్తున్నాయి. సొంతంగా శుభ్రం చేసుకునే సమయం, ఓపిక లేనివారు వీటి సేవలు పొందచ్చు.



# విశాఖ గడ్డపై మెరిసిన భారత అమ్మాయిలు... శ్రీలంకపై ఘనవిజయం

విశాఖపట్నం వేదికగా శ్రీలంకతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు ఘన విజయం సాధించింది. జెమీమా రోడ్రిగ్స్ (69 నాటౌట్) అద్భుత అర్ధ సెంచరీతో చెలరేగడంతో, టీమిండియా 8 వికెట్ల తేడాతో సునాయాసంగా గెలుపొందింది. ఇంకా ఐదు ఓవర్లకు పైగా మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 10 ఆధిక్యం సంపాదించింది. అంతకుముందు, టాస్ గెలిచిన భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 121 పరుగులు మాత్రమే చేయగలిగింది. లంక బ్యాటర్లలో విష్మి గుణరత్నే (39) టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి, క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో శ్రీలంక పెద్ద స్కోరు చేయలేకపోయింది. దీప్తి శర్మ, క్రాంతి గౌడ్, శ్రీ చరణి తలో వికెట్ పడగొట్టారు. 122 పరుగుల సాధారణ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు స్మృతి మంధాన (25), షఫాలీ వర్మ (9) మంచి ఆరంభాన్ని ఇచ్చారు. అయితే, వారిద్దరూ ఔటైన తర్వాత, జెమీమా రోడ్రిగ్స్ ఇన్నింగ్స్‌ను ముందుండి నడిపించింది. కేవలం 44 బంతుల్లో 10 ఫోర్లతో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. ఆమెకు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (15 నాటౌట్) చక్కటి సహకారం అందించడంతో, భారత్ 14.4 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన జెమీమాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఇక ఇరు జట్ల మధ్య రెండో టీ20 డిసెంబరు 23న ఇదే స్టేడియంలో జరగనుంది.

## కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతిరాజుకు
# సిపిఐ తరఫున అభినందనలు

కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతిరాజుకు సిపిఐ తరఫున అభినందనలు తెలియజేస్తున్నాం. ఆయన రాజకీయాల్లో ఉంటూ కూడా ఆదాయాన్ని సమకూర్చుకోకపోగా, తనకున్న సొంత ఆస్తి నుండి రూ.1000 కోట్ల విలువైన భూమిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చారు. ఆ భూమిలో ఏవియేషన్కు సంబంధించినవి ఏర్పాటు చేయమన్నారు. ఈనాడు రాజకీయాల్లో రూపాయి పెట్టుబడి పెట్టి రూ.100 కోట్లు సంపాదించే పరిస్థితి ఉండగా, అశోక గజపతిరాజు 1000 కోట్ల రూపాయల విలువైన తన సొంత భూమిని ఇవ్వటం ద్వారా రాజకీయాల్లో ఆదర్శంగా నిలిచారు. నేడు సమాజంలో విలువలు దిగజారి పోతున్నాయి. అవినీతిని పరాకాష్టకు చేరింది. ఈ పరిస్థితుల్లో



అవినీతి, అక్రమాలకు పాల్పడే రాజకీయ నాయకులు ఆయన సేవలను చూసి సిగ్గుతో తలదించుకోవాలి. సమాజం అశోక గజపతి రాజును అభినందించాలి.

## రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోం'..
# హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్ రెడ్డి

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన శీతాకాల విడిదిలో భాగంగా సికింద్రాబాద్‌లోని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ తేనీటి విందుకు తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు రాష్ట్ర ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్రపతి ఏటా చేపట్టే శీతాకాల పర్యటనలో భాగంగా ఈ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా శీతాకాల పర్యటన సందర్భంగా రాష్ట్రపతి హైదరాబాద్ రావడం ఆనవాయతీ. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలోని ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులతో కలిసి 'ఎట్ హోం' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. డిసెంబర్ 17 నుంచి 21 వరకు రాష్ట్రపతి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన



కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌కు 'ప్రెసిడెంట్స్ కలర్స్' ప్రదానం చేయడం వంటి అధికారిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. తన పర్యటన ముగింపులో భాగంగా రాష్ట్ర ప్రముఖులకు ఈ విందును ఏర్పాటు చేశారు. ఈ ఎట్ హోం కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్ సిఫారసుతో
# రూ.35 కోట్లు కేటాయించడం హర్షణీయం

తెలంగాణలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 96 గదుల సత్రం నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) రూ.35.19 కోట్లు కేటాయించడం హర్షణీయమని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సిఫారసుతో ఈ నిధులు మంజూరు కావడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. దీని వల్ల కొండగట్టుకు వచ్చే భక్తులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. కొండగట్టు ఆలయ అభివృద్ధికి గతంలో రూ.100 కోట్లు కేటాయిస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు. అలాగే ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నయా పైసా నిధులు కేటాయించకపోగా, ఆర్జిత సేవల ఛార్జీలను పెంచి భక్తులపై అదనపు భారం మోపుతోందని ఆరోపించారు. భక్తులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే కొండగట్టు ఆలయానికి తగిన నిధులు కేటాయించి, అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. టీటీడీ నిధులతో నిర్మించనున్న సత్రం పూర్తయితే కొండగట్టు దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు వసతి సౌకర్యాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# సరళమైన చట్టాలు, నమ్మకంతో కూడిన పాలనతోనే దేశాభివృద్ధి

భారతదేశాన్ని 'వికసిత భారత్'గా మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలంటే సరళమైన చట్టాలు, నమ్మకంపై ఆధారపడిన పాలన చాలా కీలకమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వ్యాపార విధానాలను సులభతరం చేయడం, పెట్టుబడులను ఆకర్షించడం ద్వారానే సమ్మిళిత వృద్ధి సాధ్యమవుతుందని ఆమె స్పష్టం చేశారు. కర్ణాటకలోని విజయనగర జిల్లా హంపిలో ఆదివారం జరిగిన కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖల 'చింతన్ శిబిర్'లో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో రెండు మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, సీబీడీటీ, సీబీఐసీ ఛైర్మన్లు, ముఖ్య ఆర్థిక సలహాదారు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్న సంక్లిష్టమైన చట్టాలను సరళతరం చేయాలని, ప్రజలు, సంస్థలపై అనుమానంతో కాకుండా నమ్మకంతో కూడిన పాలన అందించాలని మంత్రి సూచించారు. పన్ను ఎగవేతలను గుర్తించడం, విధాన నిర్ణయాల్లో పారదర్శకత పెంచడం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వంటి టెక్నాలజీని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై కూడా ఈ శిబిర్‌లో చర్చించారు. విజయనగర సామ్రాజ్యం సాధించిన విజయాలను గుర్తుచేస్తూనే, ప్రస్తుత అభివృద్ధి సవాళ్లను ఎదుర్కోవాల్సిన అవసరాన్ని ఆమె నొక్కిచెప్పారు. వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరిచి, దేశ ఆర్థిక ప్రగతికి అవసరమైన సంస్కరణలను వేగంగా అమలు చేయడమే ఈ చర్చల ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.

# రెండేళ్లు ఆగాం... ఇక ఆగేది లేదు: కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సుదీర్ఘ కాలం తర్వాత ప్రెస్ మీట్ పెట్టారు. కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరించారు. రెండేళ్లు ఆగామని, ఇక ఆగేది లేదని, ఇకపై ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని అన్నారు. రాష్ట్రంలో ఏం జరుగుతోంది... ఈ ప్రభుత్వం ఏం చేస్తోంది? అని ప్రశ్నించారు. భూములు అమ్మడం తప్ప ఈ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఉపేక్షించేది లేదని, రాష్ట్రాన్ని రక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ ప్రాజెక్టులు ఎందుకు ముందుకు వెళ్లడంలేదు, ఎవరి కుట్ర ఉంది... ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ విధానాలను ఎండగడతామని కేసీఆర్ హెచ్చరించారు. గోదావరి నీళ్ల దోపిడీపై ప్రభుత్వం స్పందించడంలేదని మండిపడ్డారు. పట్టిసీమ ద్వారా ఏపీ 80 టీఎంసీల గోదావరి నీటిని వాడుకుంటోందని అన్నారు. బచావత్ ట్రిబ్యునల్ ద్వారా ఎగువ రాష్ట్రాలకు ఆ 80 టీఎంసీలు ఇస్తామని ఏపీ చెప్పిందని తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్ర చెరో 20 టీఎంసీలు వాడుకుంటున్నాయని... బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను పట్టించుకున్న వారే లేరని విచారం వ్యక్తం చేశారు. 40 టీఎంసీలు చాలని కేంద్రానికి ఎలా లేఖ రాస్తారని కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. నాడు కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పాలమూరుకు ద్రోహం చేశాయని ఆరోపించారు. ఎంత దద్దమ్మ ప్రభుత్వం అయినా పాత ప్రాజెక్టులు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఇక మౌనంగా ఉండేదిలేదని, బహిరంగ సభలు నిర్వహించి నీళ్ల కోసం నిలదీస్తామని స్పష్టం చేశారు. సమైక్య రాష్ట్రంలో జరిగిన మోసం నుంచి ఇప్పటికైనా బయటపడాలంటే, కొట్లాడి మన నీటి వాటా సాధించుకోవాలని అన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు మహబూబ్ నగర్ జిల్లాను దత్తత తీసుకున్నాడని వెల్లడించారు. కానీ అభివృద్ధి పేరిట ఇష్టానుసారం పునాదిరాళ్లు వేశారే కానీ, అభివృద్ధి మాట మరిచారని విమర్శించారు. ఆ పునాది రాళ్లన్నీ కలిపితే ఒక ప్రాజెక్టు పూర్తవుతుందని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో ఒక్క చుక్క నీరు కూడా పొలాల్లోకి పారలేదని, దాంతో పాలమూరు నుంచి ముంబైకి వలసలు పెరిగాయని వివరించారు. ఆనాడు తాను నిలదీయబట్టే చంద్రబాబు జూరాల ప్రాజెక్టు నిర్మించాడని కేసీఆర్ పేర్కొన్నారు. ఆ తర్వాత ఓ టీడీపీ ఎమ్మెల్యే బాంబులతో ఆర్డీఎస్ కాలువను పేల్చేశాడని తెలిపారు. ఆనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటే తెలంగాణకు పెద్ద శాపంలా మారిందని, మహబూబ్ నగర్ జిల్లాకు తీవ్ర నష్టం జరిగిందని కేసీఆర్ వెల్లడించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మొదటి నుంచి తెలంగాణకు శనిలా దాపురించిందని అన్నారు.



## మేడారం మహాజాతర పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్

హైదరాబాద్: మేడారం మహాజాతర 2026 పోస్టర్‌ను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31వరకు మేడారం జాతర నిర్వహించనున్నారు. దీనికోసం ఇప్పటికే ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

# నారా లోకేశ్ స్పోర్ట్స్ గ్రౌండ్ లో ఎంపీఎల్ 4 పోటీలు..

గత మూడు సీజన్లుగా క్రికెట్ ప్రేమికులను అలరించిన మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్ 4 నేడు అట్టహాసంగా ప్రారంభమైంది. ఏపీ మంత్రి నారా లోకేశ్ అర్ధాంగి నారా బ్రాహ్మణి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. మంగళగిరిలోని నారా లోకేశ్ స్పోర్ట్స్ గ్రౌండ్ లో ఈ టోర్నీ నిర్వహిస్తున్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన బ్రాహ్మణి... అనంతరం మైదానంలోకి దిగి టోర్నీ ప్రారంభించారు. బ్యాట్ చేతపట్టి షాట్లు కొట్టారు. ఓపెనింగ్ మ్యాచ్ ను కొద్దిసేపు వీక్షించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్ బాబు, టాలీవుడ్ యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కూడా హాజరయ్యారు. దీనికి సంబంధించిన వీడియోను బ్రాహ్మణి సోషల్ మీడియాలో పంచుకున్నారు.

## టీడీపీ జోనల్ కో ఆర్డినేటర్లతో నారా లోకేశ్ కీలక సమావేశం

పార్టీయే అందరికీ సుప్రీం అని, పార్టీ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తు.చ.తప్పకుండా పాటించాలని ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జోనల్ కోఆర్డినేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల అమలు తీరును జోనల్ కోఆర్డినేటర్లు నిరంతరం పర్యవేక్షించాలని లోకేశ్ సూచించారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే వెంటనే పార్టీ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న అనుబంధ కమిటీల నియామకాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా, మిగిలిన నామినేటెడ్ పదవులకు అర్హులైన అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లలో సమస్యలు ఎంతవరకు పరిష్కారమవుతున్నాయో నివేదిక తయారు చేయాలని కోఆర్డినేటర్లను లోకేశ్ కోరారు. డీడీఆర్సీ సమావేశం జరిగే రోజే జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఆధ్వర్యంలో పార్టీ సమన్వయ కమిటీ సమావేశం జరుపుకోవాలని సూచించారు. ప్రతి జిల్లాలో పార్టీ కార్యాలయాల నిర్మాణంపైనా ఇంఛార్జి మంత్రులతో చర్చించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పార్టీ కార్యకర్తలు, నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులను చట్టపరంగా వేగంగా పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని లోకేశ్ భరోసా ఇచ్చారు.

# భావోద్వేగాల నియంత్రణకు ధ్యానం ఉపకరిస్తుంది

**: ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్**

చేగూరు: భావోద్వేగాలను అదుపులో ఉంచుకునేందుకు ధ్యానం ఉపకరిస్తుందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ధ్యానం చేస్తున్నవారి మనసు ఏకాగ్రతతో ఉంటుంటని తెలిపారు. మానసిక ప్రశాంతత కోసం అందరూ ధ్యానం చేయాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హా శాంతివనంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. "డిసెంబరు 21ను ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐరాస ప్రకటించింది. యోగా, ధ్యానంలో భారత్ ఎప్పుడూ ముందుంటుంది. మనదేశం ఓ



ఆధ్యాత్మిక కేంద్రం. వికసిత్ భారత్‌లో ఆర్థికాభివృద్ధే కాదు.. దేశ శాంతి కూడా భాగంగా ఉంటుంది" అని పేర్కొన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థకు ఆయన అభినందనలు తెలిపారు. శాంతి, సామరస్యం, ఆధ్యాత్మికతను ఈ సంస్థ ప్రోత్సహిస్తోందన్నారు. అందరూ ధ్యానం చేసేలా శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేష్ డి పటేల్ (దాజీ) చొరవ చూపుతున్నారని చెప్పారు. ధ్యానంతో ప్రశాంతంగా ఉండొచ్చని కమలేశ్ డి.పటేల్ (దాజీ) అన్నారు. "ధ్యానం ద్వారా ఒత్తిడి, ఆందోళనను జయించొచ్చు. మనసు కేంద్రంగా ధ్యానం చేస్తే సత్ఫలితాలు ఉంటాయి. మనసు ప్రశాంతంగా ఉంటే ఏకాగ్రత వస్తుంది. తద్వారా సునాయాసంగా విజయాలు సాధించొచ్చు. ధ్యానం చేశాక వచ్చే మార్పును మనం గమనించొచ్చు" అని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉపరాష్ట్రపతి, గవర్నర్‌లు ఒకే వేదికపై

మనం ఎన్నోసార్లు చెప్పకున్నాం.. ఒక కొత్త ప్రభుత్వం ఏర్పడి మంత్రివర్గ విస్తరణ జరుగుతున్నప్పడు మంత్రి పదవులు వస్తాయని హోప్స్ ఉన్న చాలామంది సీనియర్లు రెవెన్యూ శాఖ కావాలని కోరుకుంటారు.. నిజానికి ఆర్థిక శాఖ తరువాత అత్యంత కీలకమైన శాఖ రెవెన్యూ శాఖ.. రాష్ట్ర ఖజానాను కాపాడేది.. రైతుల సంక్షేమాన్ని రక్షించేది.. బడ్జట్ నిలకడగా ఉండేలా చూసేది రెవెన్యూ శాఖ అన్నది వాస్తవం.. ఇంతటి ఆదర్శవంతమైన శాఖను తీసుకుని ప్రజలకు ఏదైనా సేవ చేద్దామని కాదు.. అందులో ఎంత వెనుకేసుకోవచ్చు..? అన్న ఆలోచన మాత్రమే సుమా..? అయితే రెవెన్యూ శాఖకు పేరు తీసుకువచ్చిన మంత్రులు లేకపోలేదు.. అలాగే ఉన్నతాధికారులు కూడా లేకపోలేదు.. కానీ చాలా తక్కువమంది కనిపిస్తారు.. నూటికి 95 శాతం మంది ఈ శాఖ ద్వారా అక్రమార్జన చేయాలనే చూస్తారు.. చేస్తారు కూడా.. ఇది యదార్థం.. మనం ఎన్నెన్నో ఉదాంతాలు చూస్తున్నాం.. కోట్లు కూడబెట్టిన రెవెన్యూ అధికారుల చరిత్రలు కళ్ళముందు కనిపిస్తూనే ఉన్నాయి.. ఇలా అవినీతికి పాల్పడ్డ అధికారులకు, ఉద్యోగులకు శిక్షలు పడుతున్నాయా..? అంటే వేళ్ళమీద లెక్కబెట్టవచ్చు.. కేవలం సస్పెండ్ అవుతారు.. మూణ్ణెల్లకో, ఆరునెల్లకో తిరిగి విధుల్లో చేరతారు.. కుక్కతోక వంకర అన్నట్లు తిరిగి అవినీతి వ్యవహారాలూ నడిపిస్తారు.. అలా కాకుండా విధుల నుంచి డిస్మిస్ చేసి, కఠినంగా శిక్షించాలి.. అప్పడే కొంత మార్పు ఏమైనా కనిపిస్తుంది..

# తెలంగాణ రాష్ట్ర పరువు
# చెడగొడుతున్న రెవెన్యూ శాఖ..




**(స్పెషల్ కరస్పాండెంట్)**

**హైదరాబాద్, డిసెంబర్ 21 (భారత శక్తి ) :** తెలంగాణ రాష్ట్రంలో భూమి అనేది జీవనాధారం. రైతు నుంచి పట్టణ మధ్యతరగతి వరకు ప్రతి ఒక్కరి జీవితాన్ని రెవెన్యూ శాఖ నేరుగా ప్రభావితం చేస్తుంది. అలాంటి కీలకమైన రెవెన్యూ డిపార్ట్మెంట్‌పై "అవినీతి అడ్డాగా మారింది" అన్న ఆరోపణలు సంవత్సరాలుగా వినిపిస్తూనే ఉన్నాయి. భూ రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు, మ్యూటేషన్, ధరణి పోర్టల్, సర్వేలు.. ఈ విధంగా ప్రతి దశలోనూ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఈ శాఖ పనితీరుపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

**అవినీతికి మూలాలు :**

రెవెన్యూ శాఖలో అవినీతి ప్రధానంగా వివేచనాధికార దుర్వినియోగం వల్ల పెరిగిందనే అభిప్రాయం విస్తృతంగా ఉంది. తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో స్థాయిలో చిన్న పనికే లంచం అవసరం అనే భావన ప్రజల్లో బలంగా ఏర్పడిందని చెప్పవచ్చు..

భూ రికార్డుల సవరణ.. పట్టాదారు పాసుపుస్తకం జారీ.. మ్యూటేషన్ ప్రక్రియ.. భూముల వర్గీకరణ మార్పు.. ఇలాంటి ప్రతి ప్రక్రియలో ఆలస్యం కావడం, ఆ ఆలస్యాన్ని "లంచం" ద్వారా వేగవంతం చేయాల్సిన పరిస్థితి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయితే గత ప్రభుత్వంలో అవినీతిని అరికట్టేందుకు ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ఆరంభంలో ఆశలు కలిగించినప్పటికీ, కాలక్రమేణా కొత్త సమస్యలకు దారి తీసిందనే విమర్శలు వచ్చాయి. సాంకేతిక లోపాలు, స్పష్టతలేని నిబంధనలు, మానవ జోక్యం పూర్తిగా తొలగకపోవడం వల్ల పాత అవినీతి కొత్త రూపంలో కొనసాగిందని స్పష్టంగా అర్థం అయ్యింది.. "ఆన్‌లైన్‌లో పెట్టినా, చివరకు ఆఫీసు చుట్టూ తిరగాల్సిందే" అన్న భావన సామాన్యుడిలో పెరిగింది.

**ప్రజల దోపిడీ :**

గ్రామాల్లో రైతులు తమ పంటభూముల కోసం, పట్టణాల్లో మధ్యతరగతి తమ ఇంటి స్థలాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వస్తోంది ఇప్పటికీ.. రైతుకు సొంత భూమి ఉన్నా రికార్డుల్లో సమస్యలు ఏర్పడుతున్నాయి.. వారసత్వ భూములకు మ్యూటేషన్ అడ్డంకులు వస్తున్నాయి.. ఇక ప్రభుత్వ భూముల పేరుతో వ్యక్తిగత భూములపై వివాదాలు

ఈ పరిస్థితుల్లో ప్రజలు న్యాయపరమైన హక్కులు ఉన్నా, వాటిని పొందేందుకు అదనపు ఖర్చులు భరించాల్సిన దుస్థితి నెలకొంది.

నిజానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు.. సరిపోతున్నాయా? అన్న ప్రశ్నకు సమాధానం లేదు.. ప్రభుత్వం అవినీతి నివారణపై మాటలు చెప్పినప్పటికీ, కఠిన చర్యలు తక్కువగానే కనిపిస్తున్నాయనే విమర్శ ఉంది.



డిజిటలైజేషన్, విజిలెన్స్ విచారణలు, సిబ్బంది బదిలీలు ఇవన్నీ జరిగినా, జరుగుతూ ఉన్నా శిక్షల తీవ్రత, నిరంతర పర్యవేక్షణ, ప్రజా ఫిర్యాదులపై వేగవంతమైన పరిష్కారం లోపిస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. అవినీతిపై సహించేది లేదు అని డబ్బా కొట్టుకోవడం తప్ప ప్రభుత్వాల అమల్లో కనిపించడం లేదన్న భావన ప్రజల్లో బలపడుతోంది.




అసలు అవినీతి రహితంగా ముందుకు వెళ్లే దారి ఉందా..? రెవెన్యూ శాఖను నిజంగా ప్రజాపరమైన శాఖగా మార్చాలంటే: స్పష్టమైన నిబంధనలు, మానవ వివేచనకు తావు లేని విధానం కావాలి.. ప్రతి సేవకు గడువు.. ఆలస్యానికి బాధ్యత అనేది కనిపించాలి.. అవినీతిపై పట్టుబడిన అధికారులకు కఠిన శిక్షలు ఖచ్చితంగా అమలు జరగాలి.. గ్రామస్థాయిలో ప్రజా విచారణలు, సోషల్ ఆడిట్‌లు జరిగి తీరాలి..

ఇక భూభారతి వంటి పోర్టల్స్‌పై నిరంతర సమీక్ష జరుగుతుండాలి.. రాజకీయ జోక్యం నశించాలి.. అమలులో పరిపక్వత ఉండాలి..

అత్యవసరంగా ఇవన్నీ కొనసాగితేనే రెవెన్యూ శాఖ ప్రక్షాళన జరుగుతుంది..

తెలంగాణలో రెవెన్యూ శాఖలోని అవినీతి కేవలం పరిపాలనా లోపం కాదు.. అది సామాన్యుడి జీవన హక్కులపై దాడి. భూమితో ముడిపడిన సమస్యలు పరిష్కారం కాకపోతే, అభివృద్ధి మాటలు కాగితాలకే పరిమితం అవుతాయి. ప్రభుత్వం నిజంగా ప్రజల పక్షాన నిలవాలంటే, రెవెన్యూ వ్యవస్థను శుద్ధి చేయడం ఇక ఆలస్యం చేయలేని అవసరంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వాలు గ్రహిస్తే మంచిది..



## ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా 22.64లక్షల మందికి వైద్య సేవలు

**: నారా భువనేశ్వరి**



రంపచోడవరం, డిసెంబర్ 21 (భారత శక్తి ) : అల్లూరి జిల్లా రంపచోడవరంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసీలు.. భువనేశ్వరికి కొమ్ము నృత్యంతో ఘనస్వాగతం పలికారు. జీఎస్ఎల్ అండ్ జీఎస్ఆర్ హాస్పిటల్స్ సహకారంతో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి స్థానికులు భారీగా తరలి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరానికి వచ్చిన స్థానికులతో భువనేశ్వరి ఆప్యాయంగా మాట్లాడారు. శిబిరంలో 12 రకాల వైద్య సేవలు చేయించుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి రంపచోడవరంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఇప్పటి వరకు 16,365 హెల్త్ క్యాంపుల ద్వారా 22.64లక్షల మందికి వైద్య సేవలు అందించామని తెలిపారు. రూ.2.97 కోట్ల విలువైన మందులు ప్రజలకు పంపిణీ చేశామన్నారు. మొబైల్ క్యాంపుల ద్వారా మారుమూల ప్రాంతాల్లో కూడా వైద్య సేవలు అందించినట్టు చెప్పారు.

## తెలుగు రాష్ట్రాల్లో దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, డిసెంబర్ 21 (భారత శక్తి ) :లుగు రాష్ట్రాలలో చలితీవ్రత రోజు రోజుకు పెరిగిపోతుంది. ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోతున్నాయి. శనివారం తెలంగాణ వ్యాప్తంగా 4.5 నుండి 11.2 డిగ్రీల సెల్సియల్ మధ్య అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మం, వనపర్తి, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట మినహా మిగితా జిల్లాల్లో 10 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హైదరాబాద్ లోనూ గతేడాదితో పోలిస్తే చలి తీవ్రత చాలా పెరిగింది. నగరంలో 10 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ లో 5.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏపీలోనూ పరిస్థితి ఇలానే కనిపిస్తుంది. అల్లూరి జిల్లా అరకులో అయితే మంచు కురుస్తోంది. ఇక్కడ 3.5 డిగ్రీల ఉష్ణోగత్ర నమోదైంది. అరకులో సాయంత్రం 5గంటలు అవ్వకముందే వాతావరణం మారిపోతోంది. చలికి బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడిపోతున్నారు. అదే విధంగా మన్యం, చిత్తూరు, కాకినాడ, ఎన్టీఆర్, నంద్యాల, ఏలూరు, అనకాపల్లి, విజయనగరం, శ్రీ సత్యసాయి, శ్రీకాకుళం, కర్నూలు, అన్నమయ్య, అనంతపురం జిల్లాల్లో కూడా 10డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

# త్వరలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు





తిరుమల, డిసెంబర్ 21 (భారత శక్తి ) : తిరుమల లో భద్రతపై టీటీడీ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగా ఘాట్ రోడ్లలోనూ తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రమాదాల నివారణ, వాహనాల భద్రతపై చర్యలు చేపట్టేందుకు కసరత్తులు ప్రారంభించింది. ఈ మేరకు పోలీసులకు 20 బ్రీత్ ఎనలైజర్లను టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అందజేశారు. టీటీడీ పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భక్తుల భద్రతను అధిక ప్రాధాన్యతమిస్తున్నామని తెలిపారు. ఘాట్ రోడ్లలో పటిష్ట భద్రత కోసం రూ.8 లక్షల విలువైన బ్రీత్ ఎనలైజర్లను పోలీసు యంత్రానికి అంజేసినట్లు పేర్కొన్నారు. భక్తుల భద్రతకు అత్యాధునికి పరికాలను సైతం అందిస్తామని ఈవో అనిల్ కుమార్ సింఘాల్ స్పష్టం చేశారు. కాగా ఇటీవల కాలంలో అరిపిరి, తిరుమలలో మద్యం, నాన్ వెజ్ కలకలం రేపాయి. శ్రీవారం ఆలయం సమీపంలో భక్తులు ఎగ్ బిర్యానీ తిన్నారు. అలాగే కొందరు యువకులు మద్యం మద్యం మత్తులో హల్ చల్ చేశారు. దీంతో తిరుమలలో భద్రతపై విమర్శలు కురిశాయి. ఈ మేరకు అలిపిరి రోడ్డు మార్గంతో పాటు తిరుమలలోనూ పటిష్ట భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా పోలీస్ యంత్రానికి ఈవో అనిల్ కుమార్ 20 బ్రీత్ ఎనలైజర్లను అందజేశారు.

# మంత్రి నారా లోకేశ్ ఎమోషనల్ ట్వీట్



అమరావతి, డిసెంబర్ 21 (భారత శక్తి ) : తన భార్య నారా బ్రాహ్మణి జన్మదినం పురస్కరించుకొని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఎమోషనల్ ట్వీట్ చేశారు. తన సతీమణి జన్మదినాన్ని పురస్కరించుకొని ఎక్స్ వేదికగా శుభాకాంక్షలను తెలియజేశారు. తనకు వెన్నుదన్నుగా ఉంటూ వెన్నంటి నడిచే జీవిత భాగస్వామిని కొనియాడుతూ తన ఖాతాలో పోస్ట్ చేశారు. దైవ దర్శనం అనంతరం నది తీరంలో దిగిన ఫోటోను పోస్టుకు అనుబంధంగా అప్ లోడ్ చేశారు. హ్యాపీ బర్త్ డే బ్రాహ్మణి.. కష్టాల్లోనూ, సుఖాల్లోనూ, ప్రశాంతతలోనూ, గందరగోళంలోనూ నువ్వు నాకు ఎప్పుడూ అండగా ఉన్నావు. దేవాన్ష్ కు ప్రియమైన తల్లివి నువ్వు, ఒక రాక్ స్టార్ సీఈఓవి కూడా, ప్రతి అడుగులో నా తోడుగా నడుస్తున్నావు. నీకు ఎప్పటికీ నేను కృతజ్ఞుడిని. అని తన పోస్టులో పేర్కొన్నారు. ఎంతో లోతైన భావంతో నారా లోకేశ్ పోస్ట్ చేయడంతో అందరూ మంత్రిలోని మరో కోణాన్ని చూస్తున్నాం అంటున్నారు. భార్యపైన ఇంతటి ప్రేమ ఉండడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం తండ్రి సీఎం చంద్రబాబు నాయుడు అడుగుజాడల్లో నారా లోకేశ్ నడుస్తున్నారని.. ఆయనకు వెన్నంటి ఉండి కొండంత బలాన్నిస్తున్న నారా బ్రాహ్మణి అమ్మ నిండు నూరేళ్లు చల్లంగా ఉండాలని టీడీపీ శ్రేణులు, అభిమానులు మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు. జీవితంలో వారు మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.